# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY // తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 111 | విశాఖపట్నం | 22-1-2026 గురువారం | చీఫ్ ఎడిటర్ : శ్రీనివాస్ లెక్కల | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 111 | VISAKHAPATNAM | 22-1-2026 THURSDAY | CHIEF EDITOR: SRINIVAS LEKKALA | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



**రిపోర్టర్లు కావలెను**

పతాకం న్యూస్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు శ్రీకాకుళం, పాడేరు, గోదావరి జిల్లాలు తో పాటు ఆంధ్రప్రదేశ్‌లో గల రాయలసీమ, జిల్లాలో జిల్లా రిపోర్టర్స్ కావలెను.

అనుభవం ఉన్న వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వబడును.

ప్రతి వార్త ఉన్నది ఉన్నట్టుగా రాసి చూపిద్దాం రండి...

ఆఫీస్ ఇంఛార్జ్ : ఎల్.కృష్ణ రావు

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

9516171797, 9491286902




2లో

చరిత్రలో తొలిసారి.. రికార్డు స్థాయిలో రూపాయి పతనం



7లో

తుంగభద్ర నుంచి నీటి విడుదల నిలుపుదల



6లో

రొమ్ము క్యాన్సర్ ప్రమాదాన్ని ఎలా తగ్గించుకోవచ్చు?

## ఆంధ్రప్రదేశ్‌ను గ్లోబల్ బ్రాండ్‌గా

# తీర్చిదిద్దుతున్నాం: చంద్రబాబు



**దావోస్:** ప్రపంచ ఆర్థిక సదస్సులో భాగంగా స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మూడో రోజు బిజీ బిజీగా గడిపారు. ఈ పర్యటనలో భాగంగా చంద్రబాబుతో వివిధ జాతీయ, అంతర్జాతీయ మీడియా ప్రతినిధులు సంభాషించారు. టైమ్ మీడియా ప్రతినిధి టిమ్ హోవాట్, బ్లూమ్‌బర్గ్ ప్రతినిధి జీనెత్ రోడ్రిగ్స్, బిజినెస్ టుడే ప్రతినిధి అలోక్ నాయర్, ఎన్‌డీటీవీ నుంచి ఆయుష్ ఐలావాదిలతో ఇష్టాగోష్ఠిలో మాట్లాడిన సీఎం.. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి విషయంలో జరుగుతున్న పరిణామాలను, ప్రభుత్వ పాలసీలను వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తన సంభాషణలో పలు కీలక అంశాలను ప్రస్తావించారు. ప్రపంచ ఆర్థిక సదస్సు ద్వారా పెట్టుబడులు ఆకర్షించడంతో పాటు వివిధ రంగాల్లో నూతన పరిణామాలను గమనించడానికి ఈ సదస్సు అద్భుతమైన వేదికగా ఉందన్నారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను, ప్రస్తుత ఆంధ్రప్రదేశ్‌ను బ్రాండింగ్ చేసేందుకు వరల్డ్ ఎకనామిక్ ఫోరంను తాను ఉపయోగించుకున్నానని చెప్పారు. రాష్ట్రానికి బ్రాండింగ్ వస్తే పెట్టుబడులు వస్తాయని, దానివల్ల అభివృద్ధి జరుగుతుందని.. తద్వారా పేదలకు సంక్షేమం అందించవచ్చని సీఎం వివరించారు. నాడు సింగపూర్ మాజీ అధ్యక్షుడు లీ క్వాన్ యూ, మలేషియా మాజీ అధ్యక్షుడు మహతీర్ తనకు స్ఫూర్తిగా నిలిచారని చంద్రబాబు పేర్కొన్నారు. తాను ఆశావాదినని, భారీ లక్ష్యాలు నిర్దేశించుకోవడం, వాటి కోసం నిరంతరం పనిచేయడం తనకు అలవాటని అన్నారు. ముందుచూపుతో వ్యవహరించి, వినూత్నంగా ఆలోచించి, చిత్తశుద్ధితో కష్టపడి పనిచేస్తే ఏదైనా సాధ్యమని నమ్ముతానని సీఎం చెప్పారు. యువతకు ఇదే విషయాన్ని చెబుతూ, ఆ దిశగా ప్రోత్సహిస్తున్నానని తెలిపారు. తమది పరిశ్రమల ఫ్రెండ్లీ గవర్నమెంట్ అని పేర్కొన్న ముఖ్యమంత్రి.. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానం ద్వారా త్వరితగతిన అనుమతులు ఇస్తున్నామని చెప్పారు. పరిశ్రమలకు ఎస్క్రో ఖాతా ద్వారా ప్రోత్సాహకాలు ఇచ్చే విధానాన్ని అమలు చేస్తున్నామని, వాటి నుంచి పరిశ్రమల స్థాపన వరకు ప్రతి అంశాన్ని రియల్ టైమ్‌లో మానిటర్ చేస్తున్నామని వివరించారు. పరిశ్రమలకు వేగంగా అనుమతులు ఇవ్వడంతో పాటు ఉత్పత్తి వేగంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. విశాఖపట్నానికి గూగుల్ కంపెనీ రావడం ఏపీ అభివృద్ధిలో గొప్ప ముందడుగుగా చంద్రబాబు అభివర్ణించారు. ఏపీ ఐటీ మంత్రి లోకేశ్ ఈ విషయంలో చూపిన చొరవ, ఫాలో?అప్ వల్లే ఆ పెట్టుబడి సాధించామని చెప్పారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గూగుల్ పెట్టుబడిపై లోకేశ్ సంప్రదింపులు జరిపారని ముఖ్యమంత్రి తెలిపారు. వ్యవసాయంలో టెక్నాలజీ వినియోగంతో పరిస్థితులు పూర్తిగా మారుతున్నాయని, రాష్ట్రంలో అగ్రిటెక్ విధానాన్ని అమలు చేస్తున్నామని చంద్రబాబు పేర్కొన్నారు. గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ అమ్మోనియా గురించి (తరువాయి 2వ పేజీలో)

## గ్రీన్ అమ్మోనియా కేంద్రాల్లో పెట్టుబడులు పెట్టండి: లోకేశ్



**దావోస్:** దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో వివిధ దేశాలకు చెందిన వ్యాపార వేత్తలు, సీఈఓలతో భేటీ అవుతూ ఏపీ మంత్రి నారా లోకేశ్ బిజీ బిజీగా గడుపుతున్నారు. తాజాగా.. జపాన్‌కు చెందిన ప్రముఖ రెన్యువబుల్ ఎనర్జీ సంస్థ జెరా గ్లోబల్ సీఈవో అండ్ ఛైర్మన్ యుకియో కానితో మంత్రి లోకేశ్ దావోస్‌లో భేటీ అయ్యారు. ఏపీలోని గ్రీన్ అమ్మోనియా తయారీ కేంద్రాల్లో పెట్టుబడులు పెట్టాలని కోరారు లోకేశ్. జపాన్, ఇతర ఆసియా మార్కెట్లకు లో-కార్బన్ అమ్మోనియాను సరఫరా (తరువాయి 2వ పేజీలో)

## ఘనంగా మాజీ మంత్రి అమర్‌నాథ్ పుట్టినరోజు వేడుకలు

### హాజరైన పతాకం న్యూస్ ఎడిటర్ డాక్టర్ లెక్కల శ్రీనివాస్





**మింది, పతాకం న్యూస్:** మాజీ మంత్రి, వైస్సార్సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ పుట్టినరోజు వేడుకలు తన నివాసంలో ఘనంగా జరిగాయి. విశాఖ జిల్లాలో ఉన్న వైసీపీ కార్పొరేటర్లు, పార్టీ నాయకులు పాల్గొని అమర్‌నాథ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. వైసీపీ రాష్ట్ర కార్యదర్శి దొడ్డికిరణ్ ఆధ్వర్యంలో అమర్‌నాథ్ జన్మదిన వేడుకలను కార్పొరేటర్లు పార్టీ కార్యకర్తలు నాయకులతో కలిసి కేక్ కట్ చేయించిన దొడ్డి కిరణ్. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఉరుకుటి చందు, పీవీ సురేష్, అనిల్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు



## ఏపీ రాజధానిగా అమరావతి చట్టబద్ధతకు

# రంగం సిద్ధం!

**అమరావతి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతి చట్టబద్ధతకు రంగం సిద్ధమవు తోంది. కేబినెట్ ఆమోదం తర్వాత పార్లమెంటులో బిల్లు పెట్టేందుకు కేంద్రం సిద్ధమైనట్లు తెలిసింది. 10 ఏళ్లపాటు 2 రాష్ట్రాలకు రాజధానిగా ఉన్న హైదరాబాద్ గడువు 2024 జూన్ 2తో ముగిసింది. రాజధానిగా అమరావతిని ప్రకటించాలని కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం నివేదించింది. రాజధాని ఎంపిక ప్రక్రియ, నిర్మాణాలపై కేంద్రానికి నోట్ అందజేసింది. ఏ తేదీ నుంచి రాజధానిగా ప్రకటించాలో కేంద్ర హోంశాఖ చెప్పాలంది. 2024 జూన్ 2 నుంచే రాజధానిగా ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. సంబంధిత కేంద్ర శాఖల నుంచి హోంశాఖ అభిప్రాయాలు కోరడంతో పలు మంత్రిత్వ శాఖలు ఇప్పటికే తమ అభిప్రాయాలు వ్యక్తపరిచాయి. పట్టణాభివృద్ధి, న్యాయ శాఖలు ఇంకా అభిప్రాయాలు చెప్పాల్సి ఉంది. ఈ బడ్జెట్ సమావేశాల్లోనే రాజధాని ప్రకటించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టే ముందు కేబినెట్‌లో చర్చించి ఆమోదించనున్నట్లు తెలిసింది. ఈ మేరకు కేబినెట్ నోట్ తయారీలో హోంశాఖ నిమగ్నమైనట్లు అధికారులు వెల్లడించారు. రాజధాని అమరావతి నిర్మాణానికి 29 గ్రామాల రైతులు ముందుకొచ్చి 34వేల ఎకరాలు స్వచ్ఛందంగా ఇచ్చారు. సింగపూర్ ప్రభుత్వ సహకారంతో మాస్టర్‌ప్లాన్ రూపొందించారు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలోనే అక్కడ అసెంబ్లీ, సచివాలయ భవనాలు నిర్మించి పాలన ప్రారంభించారు. పెద్దఎత్తున రహదారులు, భవనాల నిర్మాణం మొదలైంది. 2019లో వైఎస్సార్సీపీ అధికారంలోకి రావడంతో అమరావతి పనులు నిలిచిపోయాయి. నాటి సీఎం జగన్ మూడు రాజధానుల ప్రతిపాదన తెచ్చారు. 2024లో కూటమి అధికారంలోకి రావడంతో అమరావతికి మళ్లీ వెలుగులొచ్చాయి. రాజధాని నిర్మాణం కోసం రూ.58వేల కోట్లతో పనులు ప్రారంభించారు. అమరావతికి భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురుకాకుండా విభజన చట్టంలో సవరణ చేసేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఏపీ రాజధానిగా అమరావతిని నోటిఫై చేస్తూ పార్లమెంటు ద్వారా విభజన చట్టంలో సవరణ చేయాలని కేంద్రాన్ని కోరారు.

### అసలు రాష్ట్ర విభజన చట్టంలో ఏముందంటే:

**పార్ట్-2 కింద 5(1) :** నిర్ణయించిన తేదీ నుంచి పదేళ్లకు మించకుండా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ ఉంటుంది.

**పార్ట్-2 కింద 5(2) :** సబ్ సెక్షన్ 5(1)లో పేర్కొన్న గడువు ముగిసిన తర్వాత తెలంగాణ రాజధానిగా హైదరాబాద్ కొనసాగుతుంది. ఆంధ్రప్రదేశ్‌కు నూతన రాజధాని ఏర్పాటవుతుంది.

**రాజధానిగా అమరావతిని ఎలా నోటిఫై చేస్తారు:**

ఆంధ్రప్రదేశ్ నూతన రాజధానిగా అమరావతిని ప్రకటిస్తూ విభజన చట్టంలో సవరణ చేస్తారు. పార్ట్2-5(2) సబ్‌సెక్షన్‌లో ఆంధ్రప్రదేశ్‌కు నూతన రాజధాని ఏర్పాటవుతుంది అనేచోట (తరువాయి 2వ పేజీలో)

## విద్య, వైద్యానికి ప్రాధాన్యం: నాదెండ్ల



**తెనాలి, పతాకం న్యూస్:** నియోజకవర్గంలో అమలవుతున్న సంక్షేమం అభివృద్ధి కార్యక్రమాలు సమీక్షించుకునేందుకు వీలుగా నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ ఏర్పాటయిందని (సివిఎపియు) రాష్ట్ర పౌరసరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. స్థానిక కొత్తపేట రామకృష్ణ కవి కళాక్షేత్రం ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన సివిఎపియు కార్యాలయంలో బుధవారం అధికారులతో (తరువాయి 2వ పేజీలో)

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## పీపీపీ ప్రయోగశాలగా ఏపీ?

రానున్న మూడేళ్లలో రూ. 17 లక్షల కోట్ల పెట్టుబడితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని 852 మౌలిక సదు పాయాల ప్రాజెక్టులను ప్రభుత్వ-ప్రైవేట్- భాగస్వామ్యం (పిపిపి) ద్వారా నిర్మించాలని కేంద్ర బిజెపి ప్రభుత్వం నిర్ణ యించింది. వీటిని పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు ప్రభుత్వాల దగ్గర లేనందున దేశీయ, విదేశీ కార్పొరేట్ కంపెనీల భాగస్వామ్యంతో చేపడుతున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన ఆర్థిక వ్యవహారాల విభాగం (డిఇఎ) ప్రకటించింది. ఈ లక్ష్యంతోనే రానున్న కేంద్ర బడ్జెట్ ప్రతిపాదనలు వుండబోతున్నాయి. గతంలో ప్రపంచబ్యాంకు వినాశకర విధానాలను అందరికంటే ముందుగా అమలు చేసిన చంద్రబాబు నాయుడు ఇప్పుడు ఈ పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌సిప్ (పిపిపి)లో ముందు వుండేందుకు సిద్ధమ య్యారు. దేశంలోని వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలన్నీ కలిసి 620 ప్రాజెక్టుల్లో ఈ ప్రైవేటీకరణ భాగస్వామ్యాన్ని అమలు చేయడానికి ప్రతిపాదనలు పంపగా, అందులో మన రాష్ట్రానికి చెందిన 296 ప్రాజెక్టులున్నాయి. రాష్ట్రంలోని ప్రధాన రోడ్లను, ఓడరేవులను, విమానాశ్రయాలను, రాజ ధాని అమరావతిని, చివరికి రైల్వే స్టేషన్‌లు, బస్టాండ్‌లను కూడా ప్రైవేట్ వారికి అప్పగించడం రాష్ట్రాభివృద్ధికి తీవ్ర విఘాతం. పిపిపి విధానం ప్రత్యామ్నాయం కాదు ఇదే పరి ష్కారం అని ఆయన అనుకూల మీడియా సంస్థలు ప్రచారం చేస్తున్నాయి. గతంలో ప్రపంచబ్యాంకు విధానాల అమలులాగే నేడు పిపిపి విధాన ప్రయోగశాలగా మన రాష్ట్రం మారనుంది. 2047 నాటికి దేశాన్ని వికసిత్ భారత్‌గా మారుస్తామని కేంద్ర బిజెపి పాలకులు చాలాకాలంగా చెబుతున్నారు. వ్యవసాయ, పారిశ్రామిక, సేవారంగాలు అభివృద్ధి చెంది ప్రజల కొనుగోలు శక్తి పెరిగి, నాణ్యమైన విద్య, వైద్యం, సామాజిక సేవలు ప్రజలందరికీ అందుబాటులో వుంటే దేశం అభివృద్ధి చెందుతుంది. దేశాభివృద్ధి అంటే జిడిపి పెరుగుదల, సంపన్నుల దగ్గర సంపద పోగుబడడం కాదని, తీవ్రమవుతున్న ఆర్థిక అసమానతలను తగ్గించడం, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ప్రోత్సహించి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం తక్షణం అవసరమని అనేక జాతీయ, అంతర్జాతీయ సంస్థల నివేదికలు చెబుతున్నాయి. కార్పొరేట్ల సేవలో తరిస్తున్న కేంద్రం ఇందుకు భిన్నంగా దేశ ప్రజల సంపదను, ప్రకృతి వనరులను కార్పొరేట్లకు అప్పగిస్తోంది. దానికి పిపిపి అనే ముద్దు పేరు పెట్టింది. ఒకవైపు ప్రపంచ మూడో ఆర్థికవ్యవస్థగా దేశం అభివృద్ధి చెందుతుం దంటున్న పాలకులు, మరోవైపు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రైవేట్ పెట్టుబడులే శరణ్యమని చెప్పడం ద్వారా ఎవరిని అభివృద్ధి చేయాలనుకుంటున్నారో అర్థమవుతుంది. ఇప్పటి వరకు నిర్మించిన ప్రాజెక్టులు, విద్యుత్?, ఓడరేవులు, విమానాశ్రయాలు, స్టీల్‌ప్లాంట్‌లు, మందుల పరిశ్రమలు ఇలా అనేకం ప్రభుత్వ పెట్టుబడితోనే నిర్మించిన విషయాన్ని కావాలనే బిజెపి పాలకులు మరుగుపరుస్తున్నారు. వీటన్నింటిని ప్రభుత్వమే నిర్మించాలని గతంలో పెట్టుబడిదారులే డిమాండ్ చేశారు. ఆ రోజుల్లో వీటి నిర్మాణానికి అవసరమైన నిధులు ఈ ప్రైవేట్ వారి దగ్గరలేవు. ప్రభుత్వ సంస్థలను ఉపయోగించుకుని లాభపడిన పెట్టుబడి దారులు తమ పెట్టుబడికి లాభాలు కావాలని డిమాండ్? చేస్తున్నారు. అందుకు పెద్ద మొత్తంలో పెట్టుబడి అవసరమైన మౌలిక రంగాల్లో ప్రభుత్వంతో కలిసి పెట్టుబడులు పెట్టాలని కోరుకుంటున్నారు. పిపిపి ద్వారా పెట్టుబడికి అవసరమైన అన్ని సదుపాయాలను ప్రభుత్వాలు ఏర్పాటు చేస్తాయి. లాభాలను కార్పొరేట్ సంస్థలు జుర్రుకుంటాయి. కేంద్ర ప్రభుత్వం ప్రకటిం చినట్లు పిపిపి విధానం 'మౌలిక సదుపాయాల అభివద్ధి' కోసం కాదు, జాతి సంపదను దేశ, విదేశీ కార్పొరేట్ సంస్థలు దోచు కోవడానికి అనుసరించే పూర్తిస్థాయి ప్రైవేటీకరణలో భాగం. మౌలిక సౌకర్యాలు కల్పించడం, సంక్షేమ పథకాలను అమలు చేయడం ప్రభుత్వాల బాధ్యత కాదన్నది ప్రపంచీకరణ సిద్ధాంతం. 1991 నుండి ఈ విధానం మన దేశంలో అమలవుతోంది. మోడీకి ముందు పాలించిన ప్రభుత్వాలు పూర్తిస్థాయి ప్రైవేటీ కరణను అమలు చేయలేకపోయాయి. ప్రస్తుత మోడి ప్రభుత్వం జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడికి అవసరమైన అండదం డలిస్తున్నది. ప్రైవేట్ కంపెనీలు కోరిన ప్రభుత్వ సంస్థలను అప్పగించడంతో పాటు, బ్యాంకు రుణాలు రద్దు చేయడం, లక్షల కోట్ల రాయితీలివ్వడం ద్వారా సంపద పోగుకావడానికి సహకరిస్తోంది. వీరి నుండి అవసరమైన నిధులను ఎన్నికల బాండ్లతో పాటు వివిధ రూపాల్లో సేకరించి ఉభయులూ లాభపడుతున్నారు. కోటీశ్వరుల దగ్గర పోగైన సంపదకు లాభాలు కావాలి, అందుకు ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలని కార్పొరేట్? కంపెనీలు కోరుకుంటున్నాయి. ఇప్పటికే బ్యాంకులు, ఇన్సూరెన్స్?, పోస్టల్?, టెలికం లాంటి ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరించిన కేంద్రం ఇప్పుడు మౌలిక సదుపాయాల నిర్మాణం పేరుతో ఆ పని చేయడానికి పిపిపిని అమలు చేస్తుంది. ఈ విధానాన్ని రాష్ట్రాలు కూడా అమలు చేయాలని ఒత్తిడి తెస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టే పిపిపి ప్రాజెక్టులకు వయబిలిటి గ్యాప్? ఫండింగ్? (వీజీఎఫ్?) కింద 20 శాతం ఆర్థిక సహాయం కూడా అందిస్తామని కేంద్రం చెబుతుంది. ఒకవైపు చట్టబద్ధంగా రాష్ట్రాలకు రావలసిన పన్నుల వాటా ఇవ్వని కేంద్రం కార్పొరేట్? కంపెనీల కోసం 20 శాతం నిధులిస్తామనడం ద్వారా ఎంతగా ప్రైవేట్ కంపెనీలకు సేవ చేయాలనుకుంటుందో అర్థమవుతోంది.

## చరిత్రలో తొలిసారి... రికార్డు స్థాయిలో రూపాయి పతనం



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** అమెరికా డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి మారకం విలువ చరిత్రాత్మక కనిష్ఠ స్థాయికి పడిపోయింది. బుధవారం ట్రేడింగ్‌లో రూపాయి భారీగా నష్టపోయి, ఒక దశలో 91.74 వద్ద ఆల్ టైమ్ కనిష్ఠాన్ని నమోదు చేసింది. మార్కెట్‌లో నెలకొన్న పలు ప్రతికూల పరిణామాల మధ్య ఒక్కరోజే 77 పైసల మేర విలువను కోల్పోయింది. 90.97 వద్ద ముగిసిన రూపాయి, బుధవారం ఉదయం 91.05 వద్ద బలహీనంగా ప్రారంభమైంది. ట్రేడింగ్ సాగుతున్న కొద్దీ అమ్మకాల ఒత్తిడి పెరగడంతో రూపాయి విలువ అంతకంతకూ దిగజారింది. బంగారం, వెండి దిగుమతులు పెరగడం, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు దేశీయ మార్కెట్ల నుంచి తమ పెట్టుబడులను భారీగా ఉపసంహరించుకోవడం పతనానికి ప్రధాన కారణంగా నిలిచింది. మరోవైపు అమెరికా, యూరప్ మధ్య వాణిజ్య యుద్ధ భయాలు, గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకునేందుకు అమెరికా ప్రయత్నిస్తోందన్న వార్తలు వంటి అంతర్జాతీయ అంశాలు కూడా రూపాయిపై తీవ్ర ఒత్తిడిని పెంచాయి. వీటికి తోడు దేశీయ స్టాక్‌మార్కెట్లు నష్టాల్లో కొనసాగడం రూపాయి విలువను మరింత బలహీనపరిచిందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

## ఆరావళి పర్వతాల్లో అక్రమ మైనింగ్.. అధ్యయనానికి కమిటీని ఏర్పాటు చేస్తాం: సుప్రీం కోర్టు



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** అక్రమ మైనింగ్ కారణంగా ఆరావళి పర్వతాలకు జరుగుతున్న నష్టంపై అధ్యయనం చేసేందుకు నిపుణుల కమిటీని నియమిస్తామని సుప్రీంకోర్టు ప్రకటించింది. ఆరావళి పర్వతాల్లో మైనింగ్, ఇతర అంశాలపై ఈ కమిటీ పూర్తిస్థాయిలో అధ్యయనం చేస్తుందని పేర్కొంది. నిపుణుల కమిటీ కోసం మైనింగ్‌పై అనుభవం ఉన్న పర్యావరణవేత్తలు, శాస్త్రవేత్తల పేర్లను నాలుగు వారాల్లో సూచించాలని అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య, అమికస్ క్యూరీ కె.పరమేశ్వర్‌కు సుప్రీంకోర్టు సూచించింది. నిపుణుల కమిటీ సుప్రీంకోర్టు పర్యవేక్షణలో పనిచేస్తుందని ధర్మాసనం స్పష్టం చేసింది.

## ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సు




**అడ్డతీగల, పతాకం న్యూస్:** అడ్డతీగల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎస్ ఎస్ టి వారి ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సు ఏర్పాటు చేయడమైనది. ఈ కార్యక్రమంలో జన సురక్ష పథకాలు అయినటువంటి ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జన్ ధన్ యోజన పథకాలపై మరియు ఉద్యమం సర్టిఫికెట్ ల గురించి ప్రజలకు వివరించడమైనది ప్రజలందరూ ఈ యొక్క పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రతి ఒక్కరు ఈ యొక్క పథకాలు యందు అవగాహన కలిగి ఉండాలని అధికారులు ప్రజలకు తెలియపరిచి ఉన్నారు.ఈ కార్యక్రమం నందు వెలుగు ఏ.పీ.ఎం.అప్పారావు మరియు ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్స్ అయినటువంటి ఎం.సుకుమార్ ,జి విశ్వనాథ్ ,ఎస్ అనిల్ పాల్గొని ఉన్నారు మరియు ఉద్యం రిజిస్ట్రేషన్ అవగాహన మరియు నమోదు కొరకు సుమారు 60 మంది చిన్న వ్యాపారస్తులు పాల్గొనిరి. వారిలో కిరాణా షాపు 27 మందికి ,కూరగాయల వ్యాపారస్తులు 10 మందికి, మినీ ఎటిఎం ఇద్దరికీ, టైలరింగ్ షాపులు 8 మందికి ఉద్యం రిజిస్ట్రేషన్ అసిస్టెంట్ ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్ ఎం.నానిబాబు పైన తెలిపిన వారందరికీ ఉద్యం రిజిస్ట్రేషన్ చేయడమైనదని తెలిపారు.

## అసెంబ్లీకి రాని ఎమ్మెల్యేలకు... 'నో వర్క్.. నో పే' విధానం అమలు చేయాలి: అయ్యన్న



**ఉత్తరప్రదేశ్:** వైసీపీ ఎమ్మెల్యేలను పరోక్షంగా ప్రస్తావిస్తూ ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీకి హాజరు కాని ఎమ్మెల్యేలకు 'నో వర్క్.. నో పే' విధానం అమలు చేయాల్సిందే అని ఆయన స్పష్టం చేశారు. అసెంబ్లీకి రాకుండా జీతాలు ఎలా తీసుకుంటారని ప్రశ్నించారు. ఉత్తరప్రదేశ్‌లో నిర్వహించిన స్పీకర్ల మహాసభలో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రజల పట్ల శాసన వ్యవస్థకు ఉన్న జవాబుదారీతనం అంశంపై అయ్యన్నపాత్రుడు కీలక ప్రసంగం చేశారు. ఎమ్మెల్యేలు ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధులని, అసెంబ్లీ సమావేశాలకు హాజరు కావడం వారి ప్రాథమిక బాధ్యత అని స్పీకర్ గుర్తు చేశారు. ప్రజలు నమ్మకంతో ఎన్నుకుని పంపిన ప్రతినిధులు సభకు రాకుండా జీతాలు తీసుకోవడం సరికాదని స్పష్టంగా చెప్పారు. శాసనసభ కార్యకలాపాల్లో పాల్గొన్నప్పుడే ప్రజల సమస్యలు చర్చకు వస్తాయని అన్నారు. ఈ అంశంపై లోక్‌సభ స్పీకర్‌తో పాటు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల అసెంబ్లీ స్పీకర్లు ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని అయ్యన్నపాత్రుడు కోరారు. శాసనసభ వ్యవస్థను మరింత బాధ్యతాయుతంగా మార్చాలంటే ఇలాంటి సంస్కరణలు తప్పనిసరిగా అవసరమని అభిప్రాయపడ్డారు.

## ఇజ్రాయెల్ ప్రతినిధులతో చంద్రబాబు భేటీ




**దావోస్:** రాజధాని అమరావతిని సైబర్ సెక్యూరిటీ నగరంగా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో సీఎం చంద్రబాబు అంతర్జాతీయ స్థాయిలో ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొనేందుకు దావోస్‌లో ఉన్న సీఎం, ఈ క్రమంలో ఇజ్రాయెల్ వాణిజ్య, పరిశ్రమల మంత్రి నిర్ బర్కత్, ఆ దేశ ట్రేడ్ కమిషనర్ రాయ్ పిషర్?తో కీలక సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో రాష్ట్రాభివృద్ధికి అవసరమైన పలు రంగాల్లో ఇజ్రాయెల్ సాంకేతిక సహకారం అందించాలని సీఎం చంద్రబాబు కోరారు. ముఖ్యంగా అమరావతిని అత్యాధునిక సైబర్ సెక్యూరిటీ నగరంగా తీర్చిదిద్దడంలో ఇజ్రాయెల్ అనుభవాన్ని వినియోగించుకోవాలని భావిస్తున్నామని తెలిపారు.

అలాగే విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో యూఏవీ డ్రోన్ల తయారీ, తీరప్రాంత భద్రత కోసం డ్రోన్ల వినియోగం, వ్యవసాయ రంగానికి అనువైన డ్రోన్ టెక్నాలజీపై సహకారం కోరారు. అంతేకాకుండా వ్యర్థ జలాల రీసైక్లింగ్, వాటర్ మేనేజ్‌మెంట్ టెక్నాలజీ రంగాల్లోనూ కలిసి పనిచేయాలన్న ప్రతిపాదనలు చేశారు. ఈ సమావేశంతో ఆంధ్రప్రదేశ్?లో ఆధునిక సాంకేతిక పెట్టుబడులు పెరిగే అవకాశాలు ఉన్నాయని ప్రభుత్వం భావిస్తోంది. ఇజ్రాయెల్ ప్రతినిధులు కూడా సహకారంపై సానుకూలంగా స్పందించినట్లు సమాచారం.

(మొదటిపేజీ తరువాయి)

## తీర్చిదిద్దుతున్నాం: చంద్రబాబు

అమరావతి కేంద్రంగా ఆంధ్రప్రదేశ్‌కి అంతా చర్చిస్తున్న సమయంలోనే ఏపీలో ఉత్పత్తికి అడుగులు వేసి పరిశ్రమ నిర్మిస్తున్నామని చెప్పారు. విదేశాలకు గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి ఎగుమతి చేసేందుకు ఇప్పటికే ఒప్పందాలు జరిగాయని తెలిపారు. టెక్నాలజీ, టెలికాం, విద్యుత్, ఏవియేషన్, నేషనల్ హైవేస్ రంగాల్లో వచ్చిన సంస్కరణలతో దేశ దశ దిశ మారిపోయిందని చంద్రబాబు అన్నారు. 30ఏళ్ల క్రితం దేశ అభివృద్ధిలో కీలక అడుగులు పడ్డాయని.. నేడు ప్రతి రంగంలో దేశం అద్భుత పురోగతి సాధిస్తోందని చెప్పారు. అప్పుడు.. ఇప్పుడు సంస్కరణలను అందిపుచ్చుకుంటున్నామని, ఆ సంస్కరణలే తమ రాష్ట్రంలోని యువతకు అవకాశాలు కల్పించాయని సీఎం వివరించారు. రాజధాని నిర్మాణం ఒక అవకాశమని.. అద్భుతమైన ప్రణాళికతో రాజధాని నిర్మాణం జరుగుతోందని చెప్పారు చంద్రబాబు. అమరావతి భవిష్యత్ నగరంగా ఉంటుందని, టెక్నాలజీ, గ్రీన్-బ్లూ సిటీగా అమరావతిని నిర్మిస్తున్నామని తెలిపారు. టూరిజం అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని, మా రాష్ట్రంలో అద్భుతమైన పర్యాటక ప్రాంతాలున్నాయని అన్నారు. ఏపీలో గ్లోబల్ లీడర్?షిప్ సెంటర్ ఏర్పాటు చేయాలనేది తన ఆలోచనగా చంద్రబాబు పేర్కొన్నారు. ఏపీ అమలు చేస్తున్న విధానాలను, చేస్తున్న ఆలోచనలను, వేగంగా తీసుకుంటున్న నిర్ణయాలను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తోందని చెప్పారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పారిశ్రామిక రంగం ఏపీ గురించి చర్చించుంటోందని తెలిపారు సీఎం. చైనా, జపాన్ సహా అనేక దేశాల్లో ఉన్న ఏజింగ్ సమస్య భారతదేశానికి లేదని, సమర్థ మానవ వనరులు, టెక్నాలజీ ఇండియా అదనపు బలమని అన్నారు. ఒకప్పుడు భారత్ ఎలక్ట్రానిక్స్ వస్తువులను దిగుమతి చేసుకునేదని.. అలాంటి పరిస్థితి నుంచి ఆ రంగంలో ఎగుమతులు చేసే స్థాయికి చేరుకుందని చెప్పారు. గతంలో డబుల్ డిజిట్ గ్రోత్ అంటే నమ్మలేదని, ఇప్పుడు అదే నిజమైందని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు.

## రంగం సిద్ధం

నూతన రాజధాని ఏర్పాటైందని పేర్కొంటారు.ఇప్పటికే రాజధాని అమరావతి పనులు అత్యంత వేగంగా జరుగుతున్న సంగతి తెలిసిందే. దేశ విదేశాల నుంచి పెట్టుబడిదారులు వచ్చి ఇక్కడ తమ సంస్థల నిర్వహణకు ఎంఓయూలు చేసుకున్న సంగతి తెలిసిందే. డేటా సెంటర్? సహా ఎన్నో కంపెనీలు రానున్నాయి. ఇదిలా ఉండగా మరోవైపు రాజధాని అమరావతి నగర విస్తరణలో భాగంగా రెండో విడత భూసమీకరణకు యంత్రాంగం పకడ్బందీ కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తోంది. తుళ్లూరు మండలంలో 3 గ్రామాలు, పల్నాడు జిల్లా అమరావతి మండలంలో 4 గ్రామాల పరిధిలో రైతుల నుంచి భూమి సమీకరిస్తున్నారు.

## గ్రీన్ అమ్మోనియా కేంద్రాల్లో పెట్టుబడులు పెట్టండి: లోకేశ్

చేయడానికి మూలపేట, కృష్ణపట్నం, కాకినాడ పోర్టుల ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఉపయోగించుకుని సమీపంలోని గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి కేంద్రాల్లో పెట్టుబడులు పెట్టాలని వారికి విజ్ఞప్తి చేశారు లోకేశ్. పారిశ్రామిక వినియోగదారులకు దృఢమైన క్లీన్ ఎనర్జీ సరఫరా చేయడానికి రాయలసీమలో సౌర-పవన హైబ్రిడ్ ప్రాజెక్టులను అభివృద్ధి చేయాలని వెల్లడించారు. జపాన్ భవిష్యత్తు క్లీన్ ఇంధన దిగుమతులకు మద్దతు ఇవ్వడానికి భారత్‌లో గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా వాల్యూ చైన్లను ఏర్పాటు చేయాలని జెరా సంస్థనిర్ణయించుకుంది. రెన్యూ ఎనర్జీ గ్లోబల్‌తో భాగస్వామ్యం ద్వారా యుటిలిటీ-స్కేల్ పునరుత్పాదక శక్తి తయారీలో భాగస్వామ్యం వహిస్తున్నట్లు జెరా సీఈవో యుకియో వెల్లడించారు. పునరుత్పాదక శక్తితో పాటు ఎల్ఎన్‌జీ ఆధారిత విద్యుత్ పరివర్తన, గ్రిడ్-బ్యాలెన్సింగ్ పరిష్కారాలపై దృష్టిసారిస్తున్నట్లు తెలిపారు.

## విద్య, వైద్యానికి ప్రాధాన్యం: నాదెండ్ల

సమీక్ష సమావేశం నిర్వహించారు. మున్సిపల్, రెవెన్యూ, పంచాయతీరాజ్‌ఆర్‌అండ్‌బి తదితర విభాగాల అధికారులతో సమీక్షించిన అనంతరం ఆయన మాట్లాడుతూ అన్ని నియోజకవర్గాలలో సంక్షేమం అభివృద్ధి కార్యక్రమాలను సమీక్షించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో సి వి ఏ పి యు ఏర్పాటు చేయడం శుభ పరిణామం అన్నారు. యూనిట్లో ప్రభుత్వం కేటాయించిన వివిధ విభాగాలకు చెందిన తొమ్మిదిమంది అధికారులు అందుబాటులో ఉంటారని, సబ్ కలెక్టర్ పర్యవేక్షణలో వారు వివిధ శాఖల పనితీరును పర్యవేక్షిస్తుంటారని చెప్పారు. నియోజకవర్గ విషయానికి వస్తే ఈ ఏడాది విద్య వైద్యానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. దానిలో భాగంగానే రూ 25 కోట్లతో 50 పడకలతో ఆయుష్ వైద్యశాల ఏర్పాటు కానుందని చెప్పారు. అలాగే జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో రూ. 25 కోట్లతో రూపుదిద్దుకుంటున్న ట్రామా కేర్ యూనిట్ కొద్ది నెలల్లో ప్రజలకు అందుబాటులోకి రానుందన్నారు. ఆసుపత్రిలో మరమ్మతులకు గురైన పరికరాలను కూడా అందుబాటులోకి తెస్తున్నామని దానిలో భాగంగానే సిటి స్కాన్ అందుబాటులోకి వస్తుందన్నారు. నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి రూ 86 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. వాటి ద్వారా రైతులకు ఉపయోగపడే లింకు రోడ్లు, గ్రామాలలో, మున్సిపాలిటీలో అంతర్గత రోడ్లు వచ్చే వేసవిలోగా నిర్మాణం కానున్నాయన్నారు. తాను శాసనసభ స్పీకర్ గా ఉన్న సమయంలో పెదరావూరు నుంచి బస్టాండ్ వరకు నాలుగు లైన్ల రోడ్డు విస్తరణ పనులు జరిగాయని, దాని కొనసాగింపుగా నందివెలుగు వరకు నాలుగు లైన్ల రోడ్డు విస్తరణ జరుగుతుందన్నారు.

# రోడ్డు ప్రమాదాలపై సమావేశం నిర్వహించిన ఎస్ఐ సురేష్



**డుంబ్రిగుడ, పతాకం న్యూస్:** మండల పరిధిలోని కించు మండ గిరిజన మార్కెట్ సంతలో మండల సబ్ ఇన్స్పెక్టర్ ఎల్. సురేష్ రోడ్డు భద్రత సమావేశాన్ని నిర్వహిం చారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ ఇటీవల నరింజ వలస గ్రామానికి చెందిన ఒక మహిళ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన దుర్ఘటనను దృష్టిలో ఉంచుకుని, ఆ మహిళ కుటుంబ సభ్యులను సమావేశానికి ప్రత్యేకంగా ఆహ్వానించారు. వారి ద్వారా ప్రజలకు రోడ్డు ప్రమాదాల వల్ల కలిగే తీరని నష్టాలు, వాహనాలు నడిపేటప్పుడు పాటించాల్సిన జాగ్రత్తలు, హెల్మెట్ ధరించడం తప్పనిసరి, మద్యం సేవించి వాహనం నడపకూడదు, వేగ నియంత్రణ వంటి ముఖ్యమైన అంశాలపై వివరంగా అవగాహన కల్పించారు. "రోడ్డు ప్రమాదాలు ఒక్క కుటుంబానికే కాకుండా మొత్తం సమాజానికి తీరని నష్టం కలిగిస్తాయి. ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి. అప్రమత్తంగా ఉండి, రోడ్డు భద్రతను తమ జీవిత భాగంగా భావించాలి" అని సూచించారు. ప్రజలందరూ ఈ విషయాలపై జాగ్రత్తగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమం ముగిసిన తర్వాత, మానవీయ దృక్పథంతో మృతి చెందిన మహిళ కుటుంబ సభ్యులకు కిరాణా సామగ్రిని అందజేశారు. పోలీస్ శాఖ ఎప్పుడూ ప్రజలతో పాటు ఉంటుందని, వారి కష్టాల్లో భాగస్వామ్యం కావడానికి సిద్ధంగా ఉందని భరోసా ఇచ్చారు. ఈ అవగాహన కార్యక్రమంలో స్థానిక ప్రజలు, వ్యాపారులు పాల్గొని, పోలీస్ శాఖ తీసుకుంటున్న చర్యలను అభినందించారు.

ఇలాంటి కార్యక్రమాలు రోడ్డు ప్రమాదాలను తగ్గించడంలో, ప్రజల్లో అవగాహన పెంచడంలో కీలక పాత్ర పోషిస్తాయని వాహనదారులు అందరూ ఒప్పుకున్నారు.

## ఫిబ్రవరి 12న ఉక్కు కార్మికుల సమ్మె



**గాజువాక, పతాకం న్యూస్:** వచ్చే నెల 12న సమ్మె చేపట్టనున్నామని ఉక్కు కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. ప్లాంటులో పనిచేస్తున్న నాన్-ఎగ్జిక్యూటి? ఉద్యోగులు పలు సమస్యలతో సతమతమవుతున్నారని, వాటిని యాజమాన్యం త్వరితగతిన పరిష్కరించాలని, లేదంటే సమ్మె తప్పదని హెచ్చరించారు. స్టీల్‌ప్లాంటు సీఐటీయూ కార్యాలయంలో జరిగిన అఖిలపక్ష కార్మిక సంఘాల సమావేశంలో సమ్మె నిర్ణయం తీసుకున్నారు. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్నవాటితో పాటు ఇటీవల యాజమాన్యం సృష్టించిన సమస్యలను పరిష్కరించాలని కార్మిక వర్గం డిమాండ్ చేస్తోంది. మరోసారి సమావేశమై యాజమాన్యానికి సమ్మె నోటీసు ఇవ్వాలని, బహిరంగ సభలు నిర్వహించి సమ్మె ఆవశ్యకతపై కార్మికవర్గాన్ని చైతన్య పరిచే కార్యక్రమాలు చేపట్టాలని కార్మిక సంఘాల నాయకులు నిర్ణయం తీసుకున్నారు.

## గణనీయంగా పెరిగిన జీవీఎంసీ పరిధిలో ఆస్తి పన్ను వసూళ్లు



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** జీవీఎంసీ పరిధిలో ఆస్తి పన్ను వసూళ్లు గణనీయంగా పెరిగాయి. ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్ను (వీఎల్‌టీ) రూపేణా 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకూ రూ.417.08 కోట్లు వసూలయ్యాయి. ఇది గత ఏడాది ఇదే సమయానికి వసూలైన మొత్తంతో పోల్చితే రూ.97 కోట్లు అధికం కావడం విశేషం. మార్చి నెలాఖరు నాటికి మరో రూ.300 కోట్లు వసూలయ్యే అవకాశం ఉందని రెవెన్యూ విభాగం అధికారులు అంచనా వేస్తున్నారు. జీవీఎంసీ పరిధిలో 6,02,937 ప్రైవేటు అసెస్‌మెంట్‌లు, రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన అసెస్‌మెంట్‌లు 1,656, కేంద్ర ప్రభుత్వ రంగానికి చెందిన అసెస్‌మెంట్‌లు 529, ఖాళీ స్థలాల పన్ను (వీఎల్‌టీ)కు సంబంధించి 39,741 అసెస్‌మెంట్‌లు, కోర్టులో కేసులు పెండింగ్ ఉన్న అసెస్‌మెంట్‌లు 689 ఉన్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ప్రైవేటు అసెస్‌మెంట్‌ల ద్వారా ఎరియర్స్? రూ.133.13 కోట్లు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పన్నుల రూపేణా రూ.433.28 కోట్లు...మొత్తం రూ.566.41 కోట్లు వసూలు కావాల్సి ఉంది. రెవెన్యూ విభాగం అదనపు కమిషనర్ ఎస్.ఎస్.వర్మ, డిప్యూటీ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావులు ఎరియర్స్‌పై ప్రత్యేకంగా దృష్టిసారించి, ఆయా అసెస్‌మెంట్‌ల యజమానుల వద్దకు వెళ్లి చర్చించారు. కేసులను ఉపసంహరించుకునేలా చేసి, వారు పన్ను చెల్లించేలా ప్రత్యేక కార్యాచరణ అమలు చేయడంతో బకాయిలు రూ.133.13 కోట్లలో రూ.43.91 కోట్లు వసూలయ్యాయి. దీంతోపాటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇప్పటివరకూ రూ.304.74 కోట్లు వసూలు చేయగలిగారు. రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన ఆస్తుల నుంచి రూ.49 కోట్లు ఎరియర్స్, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్ను రూ.20.64 కోట్లు వసూలు కావాల్సి ఉండగా, ఎరియర్స్‌లో రూ.6.06 కోట్లు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.8.78 కోట్లు వసూలు చేశారు. ఇక కోర్టులో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న 689 అసెస్‌మెంట్‌ల నుంచి ఎరియర్స్ రూ.245.96 కోట్లు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.27.72 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా...ఎరియర్స్‌లో రూ.7.28 కోట్లు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నుంచి రూ.5.15 కోట్లు వసూలు చేశారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలకు చెందిన 529 అసెస్‌మెంట్‌ల నుంచి బకాయిలు రూ.367.18 కోట్లు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.50.2 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా...ఇప్పటివరకూ ఎరియర్స్ కింద రూ.98 లక్షలు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.1.36 కోట్లు వసూలు చేయగలిగారు. ఇక వీఎల్?టీకి సంబంధించి 38,741 అసెస్‌మెంట్‌లు ఉండగా వీటిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన అసెస్‌మెంట్‌లే అధికం. ప్రభుత్వాలు వీఎల్?టీ చెల్లించకపోవడంతో రూ.396.57 కోట్లు బకాయిలు పేరుకుపోయాయి. ఇవికాకుండా ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రూ.128.61 కోట్లు వసూలు చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. రెవెన్యూ విభాగం అధికారులు ప్రత్యేకంగా దృష్టిపెట్టడంతో ఎరియర్స్? కింద రూ.18.63 కోట్లు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వీఎల్?టీ రూ.20.23 కోట్లు వసూలు చేయగలిగారు. ఈ ఏడాది ఇప్పటివరకూ అన్నిరకాల అసెస్‌మెంట్‌ల నుంచి ఆస్తి పన్ను, వీఎల్‌టీ కలిపి రూ.417.38 కోట్లు వసూలైంది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే సమయానికి ఆస్తి పన్ను కింద రూ.281.17 కోట్లు, వీఎల్‌టీ కింద రూ.39.15 కోట్లు మొత్తం రూ.320.19 కోట్లు మాత్రమే వసూలైంది. అంటే గత ఏడాది కింటే రూ.97 కోట్లు అధికంగా వసూలైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగియడానికి రెండున్నర నెలల సమయం ఉండడంతో మరో రూ.300 కోట్లు వరకూ వసూలయ్యే అవకాశం ఉందని రెవెన్యూ అధికారులు అంచనా వేస్తున్నారు.

## ఉద్యోగుల మరణాలకు చంద్రబాబు సర్కారుదే బాధ్యత: రాజబాబు

**చింతపల్లి, పతాకం న్యూస్:** ఉద్యోగుల మరణాలకు చంద్ర బాబు సర్కారుదే బాధ్యత అని కొయ్యూరు తహసీల్దార్ ఎస్ఎల్వి ప్రసాద్ హఠన్మరణాన్ని ఉద్దేశించి భారత్ ఆదివాసీ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మొట్టడం రాజబాబు అన్నారు. కొయ్యూరు మండల తహసీల్దార్ ప్రసాద్ ఏజెన్సీకి సుపరిచితుడని, చింతపల్లి, జికె వీధి, కొయ్యూరు మండల తహసీల్దార్ గా పనిచేసారని, వ్యక్తిగతంగా సౌమ్యుడు. విధి నిర్వహణలో భాగంగా కలెక్టర్ విసికి హాజరైన తహసీల్దార్ కు గుండె పోటు రావడం, వెంటనే హస్పటల్ కు తీసికెళ్ళినప్పటికి హటన్మరణం పొందడం బాధకరం. చంద్రబాబు ప్రభుత్వం బాగా పనిచేస్తుందని గొప్పలు చెప్పుకోవడానికి ఉద్యోగుల మీద ఒత్తిడి పెంచడం జరుగుతుందని, ఉద్యోగులను కనీస గౌరవం ఇవ్వడంలేదని, కలెక్టర్స్ కాన్ఫిరెన్స్ లో చూస్తున్నామని, కలెక్టర్ లకే సరైనా గౌరవం లేదని, చంద్రబాబు పని రాక్షసే కావొచ్చు కానీ ఉద్యోగులను తన రాక్షసత్వంతో హింపించకూడదని, ఉద్యోగ సంఘాలు కూడా చెప్పాలని, ఒత్తిడి కారణంగా ఉద్యోగులు ఎప్పుడు ఉద్యోగం నుండి శేషజీవితంలోకి వెళ్తామా అని ఆలోచిస్తున్నారని, శేష జీవితం(రిటైర్మెంట్ )లోకి వెళ్లిన వారికి రావాల్సిన బకాయిలు ఇవ్వడం లేదని, అదో రకమైన ఒత్తిడని, చివరకు ఉద్యోగులకు ఇచ్చే బహుమానం బిపి, సుగర్ లని, ఉద్యోగ సంఘాలు చంద్రబాబు మీద ఒత్తిడి తీసుకొచ్చి తమ మీద ఒత్తిడి తగ్గించుకోవాలని సూచించారు.

## మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం చట్టం.. పాత పద్ధతిలో కొనసాగించాలి



**అనంతగిరి, పతాకం న్యూస్:** అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం వేంగడ పంచాయతీ డొంకపుట్టు. బండవలస. మెట్టువలస. చిడివలస. గ్రామాలకు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో. ఇంటి ఇంటికి ప్రసారం చేసారు. ఈ సందర్భంగా సీపీఎం మండల నాయకులు సీవేరి కొండలరావు మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలినిర్వీరియం చెయ్యడానికి కేంద్రంలో బీజేపీ కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తుందని మహాత్మా గాంధీ పేరు తొలగించి. జి రామ్.జి. పేరు మార్చి. కుట్ర చేస్తున్నారని చట్టంని నిరీవ్యం చేసి. ఉపాధి హామీ పథకం తొలగించాలని. చుస్తునారని .కేంద్ర ప్రభుత్వం. 60%రాష్ట్ర ప్రభుత్వం 40%శాతం పెట్టుబడి చెయ్యాలని కేంద్రం చేస్తున్న ప్రత్తిపాదన కావున కేంద్రం చేస్తున్న ఉపాధి చట్టాన్ని. తొలగించి. ప్రజలను ఇబ్బంది పెట్టాలని చూస్తుంది. ప్రభుత్వం ఈ నిర్ణయానికి వెనక్కి తుసుకోవాలని. సిపిఎం పార్టీ డిమాండ్ చేస్తుంది. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పాత పద్ధతిలోనే. కొనచగించాలని. అయిన డిమాండ్ చేశారు లేని యెడల పేద ఎత్తున పోరాటం చేస్తామని హచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు చప్పి అప్పన్న. మజ్జి రామన్న. సప్పి సింహాద్రి. పి రామూర్తి. వీ సోన్య. పి. కొండన్న. అప్పలస్వామి. సప్పి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత సామూహిక అక్షరాభ్యాసం.. ముందుగా పేర్లు నమోదు చేసుకోండి



**చోడవరం, పతాకం న్యూస్ :** సామూహిక అక్షరాభ్యాసం చదువుల తల్లి సరస్వతి దేవి పుట్టినరోజు వసంత పంచమి పురస్కరించుకొని ఈ నెల 23 తేదీన శుక్రవారం ఉదయం 9.5ం నిమిషాల నుండి స్థానిక శ్రీవిజ్ఞాన్ స్కూల్ ప్రాంగణంలో నిర్వహించ బడును. వేద పండితుల సమక్షంలో 13వ ఉచిత సామూహిక అక్షరా భ్యాసం మరియు లక్ష్మీ గణపతి హోమం నిర్వహించబడునని ప్రకటన విడుదలచేశారు. కావున అక్షరాభ్యాసం కార్యక్రమం లో తల్లిదండ్రులు తమ చిన్నారులతో పాఠశాలకు హాజరవ్వాలని డైరెక్టర్ ఎంఎంకె రాజు కోరుతున్నారు. ఇందులో పాల్గొన్న వారికి పలక, బలపం మరియు పూజా సామాగ్రి ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. పిల్లల పేరు తండ్రి పేరు వారి గోత్రనామాలు వివరాలను గురువారం సాయంత్రం 6 గంటల లోపు 8247757935, 9966613368, 8143767952 నెంబర్లకు ఫోన్ ద్వారా గాని వాట్సాప్ ద్వారా కాని తెలపాలని ప్రిన్సిపాల్ జ్ఞానేశ్వరి కోరారు. అక్షరాభ్యాసం చేయించుకునే చిన్నారులను తమ పాఠశాలలోనే చదివించాలని నిబంధన లేదని ఆమె స్పష్టం చేశారు.

## టెన్త్ క్లాస్ విద్యార్థులకు మోటివేషన్ క్లాసులు కీలకం



**చింతపల్లి, పతాకం న్యూస్:** పబ్లిక్ పరీక్షలకు సిద్దమౌతున్న టెన్త్ క్లాస్ విద్యార్థులకు జీవితంలో ఈ దశ ఎంతో కీలక మని, ఈ సమయంలో వారికి మోటివేషన్ క్లాసులు చాలా అవసరమని ఉపాధ్యాయురాలు రాజేశ్వరి అన్నారు. ఆమె మాట్లాడుతూ ఈ దశలో విద్యార్థులు తమ భవిష్యత్తుపై ఆలోచించడం ప్రారంభిస్తారని, లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించేందుకు కష్టపడతారని చెప్పారు. మోటివేషన్ క్లాసులు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, తమ సామర్థ్యాలను నమ్మేలా చేస్తాయని ఆమె వివరించారు. అలాగే పరీక్షల ఒత్తిడిని తగ్గించడంలో, మానసికంగా సిద్ధం చేయడంలో ఇవి ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. సమయాన్ని సమర్థవంతంగా నిర్వహించడం, చదువును ప్రణాళికాబద్ధంగా కొనసాగించడం వంటి అంశాల్లో కూడా ఈ తరగతులు దోహదపడతాయని పేర్కొన్నారు. విజయవంతమైన వ్యక్తుల జీవిత కథలు, లక్ష్యాలను సాధించేందుకు వ్యూహాలు, ఒత్తిడిని తగ్గించేందుకు చిట్కాలు, సమయ నిర్వహణ పద్ధతులు, ఆత్మవిశ్వాసాన్ని పెంచే వ్యాయామాలు వంటి అంశాలను మోటివేషన్ క్లాసుల్లో అందించాలని ఆమె సూచించారు. టెన్త్ క్లాస్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు, ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆమె కోరారు.

## ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసులకు 100% రిజర్వేషన్ చట్టం చేయాలి: ఆదివాసీ సంఘాల డిమాండ్




**అరకులోయ, పతాకం న్యూస్:** ఆదివాసీ నిరుద్యోగుల సంఘం, ఆదివాసి స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ ఆధ్వర్యంలో పాడేరులోని ఆదివాసీ గిరిజన సంఘం కార్యాలయంలో ముఖ్యమైన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్, ఆదివాసీ నిరుద్యోగుల సంఘం జిల్లా కన్వీనర్ ఎస్. సత్యనారాయణ, ఆదివాసి స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ జిల్లా కన్వీనర్ సాగిన ధర్మపుడాల్ మాట్లాడుతూ...రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనేక సందర్భాల్లో ఆదివాసీ ప్రాంతాల్లో 100% ఉద్యోగ రిజర్వేషన్ కల్పిస్తామని హామీ ఇచ్చినా, దాని అమలులో తీవ్ర నిర్లక్ష్యం జరుగుతోందని ఆరోపించారు. గత మెగా డీఎస్సీలో సుమారు 5 వేల మంది ఆదివాసీ అభ్యర్థులు తీవ్ర నష్టపోయారని, ఆదివాసీ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు కోల్పోయి నిరాశకు గురయ్యారని వివరించారు. 5వ షెడ్యూల్ ప్రాంతాల్లో ఐటీడీఏల పరిధిలో ప్రాజెక్ట్ అధికారి పర్యవేక్షణలో ఆదివాసీ ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి, స్థానిక ఆదివాసీ అభ్యర్థులకు ఉద్యోగ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో సర్వ హక్కులు, అధికారాలు ఆదివాసులకే ఉన్నాయని, కానీ ఉద్యోగ నియామకాలు గిరిజనేతరులకు ఇవ్వడం ఆదివాసుల హక్కులను, చట్టాలను కాలరాయడమే అని విమర్శించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని తప్పకుండా అమలు చేయాలని, 100% రిజర్వేషన్లు కల్పించి ప్రత్యేక డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి నిరుద్యోగుల సంఘం జిల్లా నాయకులు డి.పి. శంకర్, రాము, ప్రశాంత్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కార్తీక్, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు బోండా గంగాధర్ పాల్గొన్నారు.

## వాహనదారులు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



**చింతపల్లి, పతాకం న్యూస్:** అల్లూరి జిల్లా చింతపల్లి మండలంలో అధిక వేగంతో నడుపుతున్న వాహనదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని చింతపల్లి ఏ ఎస్ పి నవ జ్యోతి మిశ్రా హెచ్చరించారు. ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కొందరు యువకులు మోటర్ సైకిల్ పై హల్చల్ చేస్తూ ప్రమాదకరంగా ప్రయాణించటం తో పాటు ఇతర ప్రయాణికులకు, రోడ్డుపై వెళ్తున్న పాదచారుల కు ఆందోళన కలిగేలా నడుపుతున్నారని అటువంటివారిని పట్టుకొని శిక్షిస్తామని స్పష్టం చేశారు .వాహనదారులు వాహనాలకు సంబంధించి సరైన డాక్యుమెంట్లు ఉంచుకోవాలని ,డ్రైవింగ్ లైసెన్స్ లేకపోయినా పనిష్మెంట్ తప్పదని చెప్పారు .తమ అధికారులు సిఐ వినోద్ బాబు ,ఎస్సైలు వీరబాబు మరియు ఎం వెంకటరమణ వారపు సంతలు, జాతీయ రహదారిపై చెకింగ్ చేసి వాహనదారులను అదుపు చేస్తున్నారని ఇకముందు చలానాలు తప్పవని ఆయన హెచ్చరించారు.

## ఆదివాసి నిరుద్యోగులకు చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలి



**దేవీపట్నం, పతాకం న్యూస్ :**పోలవరం జిల్లా రంపచోడవరం నియోజకవర్గం స్థానిక ఆదివాసీ పట్టభద్రులతోనే 100 శాతం ఉద్యోగాలు భర్తీ చేస్తానన్న హామీ ఏమైంది బాబు ఆదివాసీ స్పెషల్ డిఎస్సి నోటిఫికేషన్ విడుదల చేయాలని ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ డిమాండ్ చేశారు ఈ సందర్భంగా తెల్లం శేఖర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు ఎన్నికల ముందు అరకులో ఆదివాసీ నిరుద్యోగులకు 100% ఉద్యోగాలు స్థానిక ఆదివాసీ పట్టా బద్రులతోనే భర్తీ చేస్తామని ఇచ్చిన హామీ మేరకు ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ (టిఏసి) ద్వారా తక్షణమే తీర్మానం చేసి షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామకాల చట్టం ప్రకటించాలని డిమాండ్ చేశారు ఏపీ సీఎం ఇచ్చిన హామీ అమలలో నిర్లక్ష్యం వలన ఆదివాసీ నిరుద్యోగులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు ఐటిడిఏల పరిధిలో ప్రాజెక్ట్ అధికారులు పరిరక్షణలో ఆదివాసీ స్పెషల్ డిఎస్సి నోటిఫికేషన్లు విడుదల చేసి ఆదివాసీ నిరుద్యోగుల భవిష్యత్తును కాపాడాలని డిమాండ్ చేశారు ఎస్టీ బ్యాక్లాగ్ పోస్టులు స్థానిక ఆదివాసీ పట్టా భద్రులతోనే భర్తీ చేసేందుకు నోటిఫికేషన్లు విడుదల చేయాలన్నారు.

## పార్టీకి కష్టపడి పనిచేసే నాయకులకు సముచిత గుర్తింపు: అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం



**అరకులోయ, పతాకం న్యూస్:** మండల కేంద్రంలో మంగళవార అరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండల శ్రేణులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ యొక్క సమావేశానికి మండల అధ్యక్షులు స్వాబి రామ్మూర్తి ఆధ్వర్యంలో అనంతగిరి మండల అధ్యక్షులు కొర్ర సూర్యనారాయణ ఆధ్వర్యంలో కొదం గూడా గ్రామంలో ఉన్న ఆపిల్ రెస్టారెంట్‌లో నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథులుగా అరకు శాసనసభ్యులు రేగం మత్స్యలింగం, అరకు పాడేరు నియోజకవర్గం పరిశీలకులు ఏటివాక సత్యారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం మాట్లాడుతూ పార్టీకి కష్టపడి పనిచేసే నాయకులు కావాలని, వ్యక్తులకు పనిచేసే నాయకులు పార్టీకి అవసరం లేదని స్పష్టం చేశారు. పార్టీ అనుబంధ విభాగాల పలు పదవులను ఈ నెలాఖరుకల్లో పూర్తి చేయాలని వైసీపీ నేతలకు దిశానిర్దేశం చేశారు. పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు తప్పకుండా ఉంటుందని భరోసా ఇచ్చారు. అరకు వ్యాలీ మండలంలోనే 400 మంది క్రియాశీలకంగా పనిచేస్తే మిగిలిన పార్టీలు దరిదాపులకు కూడా రావని, ప్రతి కార్యకర్త గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఖాళీగా ఉన్న రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయి నామినేటెడ్ పదవులను త్వరలో క్రియాశీలకంగా పనిచేస్తున్న వ్యక్తులతో భర్తీ చేస్తామని తెలిపారు. పార్టీకి చెడ్డపేరు తెచ్చే వ్యక్తులను క్షమించేది లేదని హెచ్చరించారు. అరకు,పాడేరు నియోజకవర్గాల పార్టీ పరిశీలకులు ఏటివాక సత్యారావు మాట్లాడుతూ జగనన్నను మరల సీఎం చేయాలంటే గ్రామ కమిటీలే పునాది అని, గ్రామ పంచాయతీ కమిటీల్లో తప్పనిసరిగా 9 నుంచి 15 మంది సభ్యులను నియమించాలని సూచించారు. కోటి సంతకాల కార్యక్రమాన్ని 56 వేల సంతకాలతో విజయవంతం చేసిన అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగంను హృదయపూర్వకంగా అభినందించారు. అదే స్ఫూర్తితో గ్రామ కమిటీలను ఈ నెలాఖరుకల్లో నియమించాలని పిలుపునిచ్చారు. పార్టీ కొరకు కష్టపడి పనిచేస్తున్న కార్యకర్తలకు, భీమ సౌకర్యం త్వరలో కల్పిస్తామని రాష్ట్ర కమిటీ చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ పార్టీ కొరకు కష్టపడి పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, మండల ఉపాధ్యక్షులు, వైఎసచవతీతీచర్సిపి అనుబంధాల విభాగాల నాయకులు, వార్డు సభ్యులు, జిల్లా, మండల, గ్రామ పంచాయతీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 700 ఎకరాల్లో పరిశ్రమలు: కలెక్టర్ రామసుందర్ రెడ్డి



**విజయనగరం, పతాకం న్యూస్:** జిల్లాలో వివిధ పరిశ్రమల ఏర్పాటుకు 700 ఎకరాలు గుర్తించామని కలెక్టర్ రామసుందర్ రెడ్డి చెప్పారు. పరిశ్రమల శాఖ అధికారులతో తన చాంబర్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఏర్పాటు చేయతలపెట్టిన వివిధ పరిశ్రమలకు కావాల్సిన భూసేకరణ అనుమతుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. పూసపాటిరేగలో టాయిస్, ఫర్నీచర్, ఫుట్‌వేర్ పరిశ్రమల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాల్సి ఉందన్నారు. రెల్లివలస గ్రామంలో సుమారు 35 ఎకరాల్లో హెల్త్ హబ్ కూడా ఈ ప్రతిపాదనలో పొందుర్చాలని ఆదేశించారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో వృద్ధి సాధించేందుకు ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటుకు జిల్లా అనుకూలంగా ఉందని, బాడంగి మండలంలో 213 ఎకరాలు, గరివిడి మండలంలో 219 ఎకరాలు, ఎస్.కోట మండలంలో 155 ఎకరాలను ఇందుకోసం గుర్తించామన్నారు. సమావేశంలో జేసీ సేతు మాధవన్, సీపీవో బాలాజీ, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ కరుణాకర్ తదితరులు ఉన్నారు. చీపురుపల్లి, రాజాం నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటుకు స్థలాలు గుర్తించాలని అదే విధంగా జిల్లాలో వివిధ ప్రాజెక్టుల కోసం చేపట్టిన భూసేకరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ రామసుందర్ రెడ్డి ఆదేశించారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, తారక తీర్థసాగర్ ప్రాజెక్టులతో పాటు తోటపల్లి, జాతీయ రహదారి 516(బి), రైల్వే లైన్ల విస్తరణ తదితర అంశాలపై సమీక్షించారు. వీటన్నింటికీ భూసేకరణ, ఇతర రెవెన్యూ పరమైన అంశాలను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. చీపురుపల్లి, రాజాం నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు స్థలాలు గుర్తించి, భూసేకరణ ప్రక్రియ చేపట్టాలన్నారు. బొబ్బిలి ఎంఎస్ఎంఈ పార్కు సమస్యను త్వరగా పరిష్కరించాలన్నారు. సమావేశంలో జేసీ సేతు మాదవన్, డీఆర్వో మురళి, ఆర్డీవోలు కీర్తి, సత్యవాణి, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ కళావతి ఉన్నారు.

## పరవాడలో ఘనంగా మార్కండేయ జయంతి



**పరవాడ, పతాకం న్యూస్:** మేజర్ పంచాయతీ పరవాడలో బుధవారం పద్మశాలి సభ్యుల ఆధ్వర్యంలో మార్కండేయ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు వానపల్లి అప్పలరాజు మాట్లాడుతూ మార్కండేయ చరిత్ర అంటే, భృగు వంశానికి చెందిన మహర్షి మృకండు, మరుద్వతి దంపతులకు శివుని వరంతో జన్మించిన, 16 ఏళ్ళకే మరణించాల్సిన వాడు, కానీ శివుని అపార భక్తితో మృత్యువును జయించి చిరంజీవిగా మారిన మార్కండేయ మహర్షి కథ. తన భక్తితో యముడిని ఎదిరించి, శివుని అనుగ్రహంతో అమరత్వం పొందిన ఈయన పేరు మీద మార్కండేయ పురాణం ఉంది, మహాభారతం, భాగవతంలో కూడా ఈయన ప్రస్తావన ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వానపల్లి సూరిబాబు దంపతులు, సిద్దనాతి దేవుడు దంపతులు, సూరిశెట్టి రామబ్రహ్మరావు దంపతులు, బ్యాంకు దేవుడు దంపతులు, దొడ్డి కృష్ణ దంపతులు, నేమాల రాము దంపతులు, తేలు మురళిదంపతులు, వానపల్లి చలపతిరావు, తేలు పైడిరాజు, గుదే సంజీవరావు, కాకి వీరభద్రరావు, గుదే పైడి రాజు, దొడ్డి నూక అప్పారావు, తేలు రమణజీ కుల సంఘ సభ్యులందరూ పాల్గొన్నారు.

## రోడ్డు సురక్ష, మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం




**దుంబ్రిగూడ, పతాకం న్యూస్ :** సీతారామరాజు జిల్లా ఆదేశాల మేరకు, మండల కేంద్రంలోని కిల్లోగూడ పోలీస్ సూపరింటెండెంట్ అమిత్ బర్దర్ ఐపీఎస్ గ్రామంలో రోడ్డు ప్రమాదాల నివారణ, మాదకద్రవ్యాలకు వ్యతిరే కంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల సబ్ ఇన్స్పెక్టర్ ఎల్. సురేష్ నేతృత్వంలో గ్రామస్తులు, యువతతో కలిసి రోడ్డు సురక్షపై చర్చలు జరిపారు. ప్రధానంగా ప్రయాణ సమయంలో అధిక వేగంలో బైకులు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. వాహనదారులు సురక్షితంగా వాహనాలు నడిపి, గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుకోవాలని సూచించారు. హెల్మెట్ ధరించడం, వేగ పరిమితులు పాటించడం, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని గట్టిగా హెచ్చరించారు. అదే సమయంలో, యువత గంజాయి వంటి మాదకద్రవ్యాల జోలికి పోకూడదని స్పష్టంగా తెలియజేశారు. అటువంటి వ్యక్తులపై ఎన్ డి పి ఎస్ యాక్ట్, పీడీ యాక్ట్, పిట్ ఎన్ డి పి ఎస్ యాక్ట్ ల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామస్తులు, యువత ఈ సందేశాన్ని గ్రామస్తులు తూచ తప్పకుండా స్వీకరించి, సమాజంలో సానుకూల మార్పు తీసుకురావాలని ఎస్ ఐ ఎల్ సురేష్ కోరారు. గ్రామస్తులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## జీ-రాంజీ పథకాన్ని తీవ్రంగా ఖండించిన సీపీఎం నాయకులు



**దుంబ్రిగూడ, పతాకం న్యూస్:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ను నిర్వీర్యం చేయడానికే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం జీ-రాంజీ పథకాన్ని తీసుకొచ్చిం దని సిపిఎం పార్టీ దుంబ్రిగూడ మండల నాయకులు, గసభ పంచాయతీ మాజీ సర్పంచ్ ఆరోపించారు. గసభ పంచాయతీ మొర్రిగూడ గ్రామంలో ప్రజలతో సమావేశమైన వారు, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం చట్టాన్ని కొనసాగించాలని, జీ-రాంజీ పథకాన్ని రద్దు చేసి గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పేద ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతుందని, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలకు ఆర్థిక భారం పడుతుందని విమర్శించారు. అలాగే, ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయకుండా బిజెపి ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. రాష్ట్రానికి ద్రోహం చేస్తున్న టిడిపి, జనసేన, వైసీపీ పార్టీలు దీనిని ప్రశ్నించకపోవడం దుర్మార్గమని, ఇప్పటికైనా మేల్కొని ప్రజల పక్షాన పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్ పాంగి రాజ్ కుమార్, సిపిఎం నాయకులు పాంగి కొత్తు, పాంగి కృష్ణమూర్తి, వంతాల సుబ్బారావు, పాంగి రామరావు, పాంగి ధర్మరావు, వంతాల సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ఆర్థిక శాఖ జాయింట్ సెక్రటరీ విస్తృత పర్యటన



**పాడేరు, పతాకం న్యూస్:** కేంద్ర ఆర్థిక శాఖ జాయింట్ సెక్రటరీ అమిత్ సంగ్లా జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. జిల్లాలోని అరకులోయ, డుంబ్రిగుడ మండలాల్లోని పలు గ్రామాలను సందర్శించి, ఆయా ప్రాంతాల్లో గిరిజన రైతుల సాగు పద్ధతులను పరిశీలించారు. తొలుత ఆయన అరకులోయ మండలం తుడుము గ్రామంలోని ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌ను పరిశీలించి, అక్కడ విత్తన ఉత్పత్తి, ఎరువుల తయారీపై ఆరా తీశారు. అలాగే గంజాయిగుడ గ్రామంలో గిరిజన రైతులు ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శనను తిలకించారు. చినలబుడు గ్రామంలోని కాఫీ తోటలు, డుంబ్రిగుడ మండలం కొర్రాయి గ్రామంలో అవకాడో, అల్లం, మిరప పంటలను పరిశీలించి, సాగు పద్ధతులను రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన అరకులోయలో కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరు, గిరిజనుల ఆర్థికాభివృద్ధికి దోహదపడుతున్న అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పరిస్థితులు, పథకాల అమలు, ఆదాయం, తదితర అంశాలను కలెక్టర్ దినేశ్‌కుమార్.. కేంద్ర ఆర్థిక శాఖ జాయింట్ సెక్రటరీ అమిత్ సంగ్లాకు వివరించారు. అరకులోయలో రాత్రి బస చేసిన ఆయన బుధవారం చింతపల్లి మండలంలో పలు గ్రామాల్లో పర్యటించి ఆయా ప్రాంతాల్లో కేంద్ర పథకాల అమలు, వ్యవసాయ పద్ధతులను పరిశీలించనున్నారు.

## నూతన అంగన్వాడీ భవనం నిర్మాణ కొరకు శంకుస్థాపన



**అడ్డతీగల, పతాకం న్యూస్:** పోలవరం జిల్లా రంపచోడవరం డివిజన్ అడ్డతీగల మండలం బొడ్లంక పంచాయతీ వెంకటనగరం గ్రామంలో ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి ఆదేశాల మేరకు ఎంపీడీవో ఏవివి కుమార్ ఆధ్వర్యంలో కొత్తగా మంజూరైన అంగన్వాడి భవనం శంకుస్థాపన కార్యక్రమం పంచాయతీ సెక్రటరీ కే అశోక్, సర్పంచ్ బి రాఘవ, కూటమి నాయకులు చేతుల మీదగా శంకుస్థాపన జరిగింది. ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ బి. రాఘవ, పంచాయతీ అభివృద్ధి అధికారి కే అశోక్, గ్రామ టిడిపి నాయకులు కె.రాఘవ, కూటమి నాయకులు, గ్రామస్తులు పాల్గొనడం జరిగింది.

## కొయ్యూరు తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి తోట దొరబాబు సారథ్యంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



**కొయ్యూరు, పతాకం న్యూస్:** అల్లూరి జిల్లా,కొయ్యూరు మండలం,ఆడాకుల పంచాయతీ,కించెలి గ్రామానికి చెందిన పొట్టిక జై విశ్వ వర్ధన్ అనారోగ్య కారణంగా ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.1,49,000 ఆర్థిక సహాయం అందించారు. ఈ చెక్కును కోఆపరేటివ్ డైరెక్టర్ కూనిశెట్టి జోగారావు,మాజీ వైస్ ఎంపీపీ కూనిశెట్టి దివానం,యూనిట్ ఇంచార్జి కూనిశెట్టి సత్తిబాబు,గ్రామ కమిటీ అధ్యక్షులు కూనిశెట్టి అప్పారావు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆడాకుల గ్రామస్తులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు,పాడేరు నియోజకవర్గ ఇంచార్జి,మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు బ్రహ్మాజీ,కేరపు రాంబాబు,కూనిశెట్టి బ్రహ్మరాజు,సాగరి లోవరాజు,ఆకుల రాజబాబు,స్కూల్ కమిటీ చైర్మన్ లంక లోవరాజు,గుల్ల జోగిరాజు, మూక్కి రమణ,బౌలెం తలుపులు తదితరులు పాల్గొన్నారు.

## గుండెపోటుతో కొయ్యూరు తహసీల్దార్ ప్రసాద్ ఆకస్మిక మృతి

**కొయ్యూరు, పతాకం న్యూస్:** అల్లూరి జిల్లా,కొయ్యూరు మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్.ఎల్.వి.ప్రసాద్ గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. జిల్లా కలెక్టర్‌తో జరిగే వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొనేందుకు సిద్ధమవుతున్న సమయంలో ఆయనకు ఒక్కసారిగా గుండెపోటు రావడంతో కుప్పకూలిపోయారు. సిబ్బంది వెంటనే అప్రమత్తమై రాజేంద్రపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా,వైద్యులు సిపిఆర్ చేసి ప్రయత్నించి నప్పటికి ఫలితం లేకపోవడతో ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. తహసీల్దార్ ఆకస్మిక మృతి పట్ల కొయ్యూరు మండలంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. ప్రజలు,అధికారులు ఆయనకు నివాళులు అర్పిస్తూ సంతాపం వ్యక్తం చేశారు.



## పశు వైద్య శిబిరం ద్వారా పాడి రైతులకు ప్రయోజనం



**చోడవరం, పతాకం న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పశు ఆరోగ్య శిబిరాల్లో భాగంగా బుధవారంనాడు చోడ వరం మండలం రాయపురాజుపేట గ్రామంలో అడ్డూరు పశువైద్యాధికారి డాక్టర్ బి ప్రశాంతి కుమార్ ఆధ్వర్యంలో పశు ఆరోగ్య శిభిరం నిర్వహించారు. రాయపురాజుపేట సర్పంచ్ బొడ్డేటి రామ నాయుడు మరియు రాష్ట్ర గవర సంఘ డైరెక్టర్ బొడ్డేటి నాగ గంగాధర ప్రారంభించారు. ఈ శిబిరంలో పశువులకు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతో పాటు పశువులకు ఉచితంగా నట్టల నివారణ మందులు వేయడం జరిగింది. పాడి రైతులను ఉద్దేశించి అడ్డూరు పశు వైద్యాధికారి డాక్టర్ టి ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ రైతులు తమ పశువులను మరియు మేకలను నట్టలు నివారణ మందులు వేయించుకోవాలని సూచించారు. అలాగే జ్వరము జీర్ణ సమస్యలు మరియు ఇతర ఆరోగ్య సమస్యలకు చికిత్స చేస్తారని పాడి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో చోడవరం నియోజకవర్గ పశు వ్యాధి నిర్ధారణ ప్రయోగశాల ల్యాబ్ టెక్నీషియన్ బి శ్రీదేవి పశుసంవర్ధక శాఖ సహాయకుడు వై నాయుడు వెంకన్నపాలెం పశుసంవర్ధక శాఖ సహాయకులు మరియు పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

## 23న మెగా ఉద్యోగ మేళా

**భోగాపురం, పతాకం న్యూస్:** మంత్రి నారా లోకేశ్ పుట్టినరోజును పురస్కరించుకుని ఈనెల 23వ తేదీన పూసపాటిరేగ ఎస్‌వీఎస్ఆర్ జూనియర్, డిగ్రీ కళాశాల ఆవరణలో మెగా ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర మార్క్ ఫెడ్ చైర్మన్, టీడీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు తెలిపారు. పోలిపల్లి గ్రామంలో ఆయన మాట్లాడుతూ ఈ జాబ్ మేళాకు 17 కంపెనీలు హాజరు కానున్నాయని చెప్పారు. మేళాకు హాజరయ్యే అభ్యర్థులు క్యూఆర్ కోడ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, బీటెక్ పూర్తిచేసినవారు ఈ మేళాలో పాల్గొన వచ్చని చెప్పారు. ఇతర వివరాలకు 9550262700, 8688572605, 76608 28187 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

## రైల్వే ప్రయాణికులకు సౌకర్యాలను పెంచండి



**డోన్, పతాకం న్యూస్:** రైల్వే ప్రయాణికుల సౌకర్యాలను పెంచడానికి చేపడుతున్న వివిధ పనులను సకాలంలో పూర్తి చేయాలని దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాత్సవ అధికారులను ఆదేశించారు. గుంతకల్లు డివిజన్‌లోని గుంతకల్లు రైల్వేస్టేషన్‌తో సహా బళ్లారి-గుంతకల్లు, డోన్, నంద్యాల జంక్షన్లను ఆయన తనిఖీ చేశారు. జీఎంతో పాటు గుంతకల్లు డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ చంద్ర ఎస్.గుప్త, ప్రధాన విభాగాధిపతులు, ప్రధాన కార్యాలయం డివిజన్‌కు చెందిన ఇతర సీనియర్ అధికారులు ఉన్నారు. ఈ సందర్భంగా జీఎం బళ్లారి నుంచి రియర్ విండో తనిఖీని ప్రారంభించారు. రైల్వే ట్రాక్‌ల భద్రతా అంశాలను కర్వ్, లెవెల్ క్రాసింగ్‌లను, ఎల్‌సీ, సిగ్నలింగ్ వ్యవస్థ, వంతెనలు, ఆ సెక్షన్‌లోని ప్రముఖ స్టేషన్లను పరిశీలించారు. గేట్‌మెన్‌లతో పని పరిస్థితుల గురించి చర్చించారు. జనరల్ మేనేజర్ గుంతకల్లులోని మెడికల్ రిలీఫ్ వ్యాన్, యాక్సిడెంట్ రిలీఫ్ రైలులో అందుబాటులో ఉన్న సంసిద్ధతను సౌకర్యాలను పరిశీలించారు. డోన్‌లో రూ.46.41 కోట్ల వ్యయంతో జరుగుతున్న డోన్ అమృత్ స్టేషన్‌లో పనులను సమీక్షించారు. పాణ్యం స్టేషన్‌లో జనరల్ మేనేజర్ ప్లాట్‌ఫామ్‌లపై ప్రయాణికుల సౌకర్యాలను, దివ్యాంగుల టాయిలెట్లను కూడా పరిశీలించారు. ఈతనిఖీలో మాజీ మంత్రి, డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డితో సహా అనేక మంది ప్రజాప్రతినిధులు జీఎంను కలిశారు. పలువురు నుంచి వినతులు స్వీకరించారు. రోజు వారీ పనిలో సాధారణంగా ఎదురయ్యే సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని జీఎం సంజయ్ కుమార్ శ్రీవాత్సవ సూచనలు చేశారు.

## ఏఐ ద్వారా ఏనుగుల కదలికల గుర్తింపు



**కేరళ, పతాకం న్యూస్:** అటవీ సరిహద్దు ప్రాంతాల్లో ఏనుగులు, మానవ ఘర్షణలు తలెత్తకుండా చూసేందుకు ప్రత్యేక నిఘా వ్యవస్థను కేరళ ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం కృత్రిమ మేధ (ఎఐ) సాంకేతికతను వినియోగించనుంది. ఏనుగుల కదలికల సమాచారం ఎప్పటికప్పుడు తెలియజేస్తూ అటవీ ప్రాంతాల్లో సంబంధిత ప్రజానీకానికి హెచ్చరికలు జారీ చేసేలా ఈ వ్యవస్థ ఏర్పాటు కానుంది. ఇందుకోసం టాటా మోటార్స్, టాటా కమ్యూనికేషన్స్ సంయుక్తంగా అభివృద్ధి చేసిన ఎఐ వ్యవస్థను వినియోగించేలా ఆ గ్రూపు సంస్థలతో కేరళ ప్రభుత్వంఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందంపై రాష్ట్ర అటవీ శాఖ కార్యదర్శి రాజేష్ రవీంద్రన్, చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్? జి.కృష్ణన్, టాటా మోటార్స్ గ్రూప్ జిఎం, టాటా కమ్యూనికేషన్స్? జిఎం సిద్ధార్థ చిబ్? సంతకాలు చేశారు. అటవీ సరిహద్దుల్లో ఏనుగుల కదలికను గుర్తించి, హెచ్చరికలను విడుదల చేసే ఆన్-సైట్ వీడియో విశ్లేషణ సామర్థ్యం కల ఎఐ కెమెరాలను ఏర్పాటు చేయనున్నారు. కెమెరాలు, విద్యుత్ సరఫరా వ్యవస్థలను అమర్చడానికి కస్టమ్-డిజైన్ స్థంభాల అభివృద్ధి కూడా ఈ ఒప్పందంలో భాగంగా ఉంది. ముందుగా ఈ ప్రాజెక్టు పైలట్ దశను విజయవంతంగా పూర్తిచేసిన తరువాత రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని కేరళ ప్రభుత్వం భావిస్తుంది.

## దమ్ముంటే చర్చకు రా.. ఏబీ వెంకటేశ్వరరావుకు జనసేన నేత బొలిశెట్టి సవాల్!



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** అమరావతి రాజధాని అంశం మరోసారి రాజకీయ వేడిని రాజేస్తోంది. రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు, జనసేన నేత బొలిశెట్టి సత్యనారాయణ మధ్య మాటల యుద్ధం తీవ్రస్థాయికి చేరింది. ఆరోపణలు, ప్రత్యారోపణలతో ప్రారంభమైన ఈ వివాదం, చివరికి బహిరంగ చర్చకు రావాలంటూ సవాళ్లు విసురుకునే వరకు వెళ్లింది. ఇటీవల వైసీపీ అధినేత జగన్ అమరావతిపై చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఏబీ వెంకటేశ్వరరావు స్పందిస్తూ, రాజధాని నిర్మాణంలో జాప్యానికి గల కారణాలను వివరించారు. "అమరావతికి పర్యావరణ అనుమతులు రాకుండా అడ్డుకునేందుకు చాలా పిటిషన్లు వేశారు. అందులో బొలిశెట్టి సత్యనారాయణ కూడా ఒకరు. ఆ పెద్దాయనతో సుప్రీంకోర్టు వరకు కేసులు వేయించి, పనులను మూడేళ్లపాటు సాగదీశారు. దీనివల్లే నిర్మాణం పూర్తికాలేదు. ఇప్పుడు మేం నిజాలు చెబుతాం, అబద్ధాలను ఖండిస్తాం" అంటూ ఏబీ వ్యాఖ్యానించారు. ఏబీ వెంకటేశ్వరరావు ఆరోపణలపై జనసేన నేత బొలిశెట్టి సత్యనారాయణ తీవ్రంగా స్పందించారు. ఆయన వ్యాఖ్యలు పూర్తిగా నిరాధారమని, అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తాను అమరావతి రాజధానికి, రైతులకు ఎల్లప్పుడూ మద్దతుగా నిలిచానని గుర్తుచేశారు. తాను వేసిన కేసులు కేవలం అమరావతిలోని జరీబు భూములు, వరద ముంపు ప్రాంతాలు, పర్యావరణ పరిరక్షణ కోసం మాత్రమేనని, రాజధాని నిర్మాణాన్ని అడ్డుకోవడానికి కాదని స్పష్టం చేశారు. "వైసీపీ పాలనలో ఏబీ వెంకటేశ్వరరావు కలుగులో దాక్కున్నప్పుడు, నేను జగన్ ప్రభుత్వ అరాచకాలకు వ్యతిరేకంగా పోరాడాను. అలాంటి నన్ను జగన్ మనిషి అనడం హాస్యాస్పదం. సంస్కారం లేకుండా తప్పుడు ఆరోపణలు చేయడం మానుకోవాలి" అని బొలిశెట్టి హితవు పలికారు.

# గోదావరి పుష్కరాలు.. గోష్పాద క్షేత్రంలో ఇంకా మొదలుకాని పనులు



**కొవ్వూరు, పతాకం న్యూస్:** గోదావరిలో నిత్యం విశేష సంఖ్యలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి బాలా త్రిపుర సుందరి సమేత సుందరేశ్వర స్వామిని దర్శించుకునే దివ్య ధామం కొవ్వూరు గోష్పాద క్షేత్రం. ఇంతటి పవిత్రమైన క్షేత్రం అపరిశుభ్ర పరిసరాలు, ప్రమాదకర పరిస్థితులకు నెలవుగా మారింది. వచ్చే ఏడాది నిర్వహించే గోదావరి మహా పుష్కరాల్లో రాజమహేంద్రవరంతో పాటు ఆవలి ఒడ్డున ఉన్న కొవ్వూరు ఘాట్లు కీలకంగా మారనున్నాయి. ఈ పరిస్థితుల్లో తీరం అభివృద్ధి పనులు ఇంకా ప్రారంభం కాకపోవటంపై భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గోదావరి మహా పుష్కరాలు 2027 జూన్ 26 నుంచి 12 రోజులపాటు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముహూర్తం ఖరారు చేసింది. కోట్ల మంది భక్తులు తరలివచ్చి అఖండ గోదావరి తీరంలోని రాజమహేంద్ర వరంతో పాటు వివిధ ప్రాంతాల్లో పుణ్యస్నానాలు ఆచరిస్తారు. ఆ మహాక్రతువు నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు అవసరమవుతాయి. రాజమహేంద్రవరానికి ప్రత్యామ్నాయంగా విజయవాడ తెలంగాణ వైపు నుంచి వచ్చే భక్తులు కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో పుణ్యస్నానం ఆచరించేందుకు ఈసారి ఏర్పాట్లు చేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులు ఇప్పటికే నిర్ణయించారు. గోష్పాద క్షేత్రంలో పుణ్యస్నానం ఆచరించి బాలా త్రిపుర సుందరి సమేత సుందరేశ్వర స్వామిని దర్శించుకుంటే సకల శుభాలు కలుగుతాయని భక్తులు విశ్వసిస్తుంటారు.

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో 16 నియోజకవర్గాల్లోని 34 మండలాల్లో గోదావరి మహా పుష్కరాలకు సంబంధించి భక్తులు స్నానాలు చేసేందుకు ఘాట్లు సిద్ధం చేయాల్సి ఉంది. కొత్తగా 97 ఘాట్లు నిర్మించాల్సి ఉంది. 250 పాత ఘాట్లకు మరమ్మతులు చేయాలని జలవనరుల శాఖ అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. కొవ్వూరులో కొత్తగా ఐదు ఘాట్ల నిర్మాణం, 30 ఘాట్ల మరమ్మతులు ఈ ప్రతిపాదనలో ఉన్నాయి. అయితే ఇప్పటివరకు పనులు మాత్రం ప్రారంభం కాలేదు. కొవ్వూరు గోష్పాద క్షేత్ర పరిసరాలన్నీ అపరి శుభ్రంగా ఉండటంతో భక్తులకు తీవ్ర అసౌకర్యం కలుగుతోంది. ఘాట్లు చెత్తా చెదారాలతో నిండిపోయాయి. గోదావరిలో స్నానమాచరించాలంటే నాచు పేర్కొన్న మెట్ల పైనుంచి జారి నదిలో పడిపోతున్నామని భక్తులు ఆవేదన చెందుతున్నారు. గోదావరి ఏటిగట్టు పరివాహక ప్రాంతమంతా చెత్త చెదారాలతో నిండి దుర్గంధం వస్తోంది. మహిళలు దుస్తులు మార్చుకునేందుకు ఉన్న కొద్దిపాటి గదులు లోపలికి అడుగు పెట్టలేని విధంగా ఉన్నాయి. అలాగే కొవ్వూరులో ప్రధాన రహదారులు, అనుబంధ రహదారులు, పార్కింగ్ ప్రాంతాలు, వాటి అభివృద్ధి పనులు, నూతన నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. ప్రతి పన్నెండేళ్లకు ఒకసారి ఈ మహా పుష్కరాలు జరుగుతాయి.

గోదావరి మన రాష్ట్రంలో అల్లూరి సీతారామరాజు, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల పరిధిలో ప్రవహిస్తుంది. గత పుష్కరాల కోసం 202 ఘాట్లు ఏర్పాటు చేశారు. ఇందులో కుడివైపు 127, ఎడమవైపు 75 ఘాట్లు ఉన్నాయి. గోదావరిలో 2027లో జరగబోయే పుష్కరం 9వది. మొదటగా 1884లో గోదావరి పుష్కరాలు ప్రారంభమయ్యాయి. ఆ తరువాత భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక 1956 లో మొదటి పుష్కరాలు జరిగాయి. తరువాత ప్రతి 12 సంవత్సరాలకు ఒకసారి ఈ పుష్కరాలు ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రశాంతగా జరుగుతున్నాయి. ఈసారి గోదావరి పుష్కరాల నిర్వహణలో ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి.

# పెదమదీనలో కర్రలతో పరస్పరం దాడులు చేసుకుంటున్న జనసేన, టీడీపీ శ్రేణులు

**బుచ్చెయ్యపేట, పతాకం న్యూస్:** మండలంలోని పెదమదీన గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూమిలో అకేసియా చెట్ల నరికివేతపై తెలుగుదేశం, జనసేన పార్టీల శ్రేణుల మధ్య గొడవ జరిగింది. ఇది చినికి చినికి గాలివానగా మారి కొట్లాటకు దారితీసింది. ఇరు పార్టీల కార్యకర్తలు రాళ్లు, కర్రలతో పరస్పరం దాడులు చేసుకున్నారు. దీంతో నలుగురికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి వచ్చి పికెట్ ఏర్పాటు చేశారు. పెదమదీన రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 81లో సుమారు 40 ఎకరాల ప్రభుత్వ కొండపోరంబోకు భూమి వుంది. సామాజిక అటవీ శాఖ అధికారులు సుమారు 15 సంవత్సరాల క్రితం ఈ భూమిలో అకేసియా మొక్కలు నాటించారు. వీటి పరిరక్షణ బాధ్యతను వన సంరక్షణ సమితికి అప్పగించారు. అకేసియా చెట్లు ఇప్పుడు ఏపుగా పెరగడంతో అటవీ శాఖ అధికారులు వీటిని పంచాయతీకి అప్పగించారు. చెట్లను నరికివేయించి, వాటినికి విక్రయించగా వచ్చిన సొమ్ముతో పంచాయతీలో అభివృద్ధి పనులు చేసుకోవాలని సూచించారు. దీంతో పది రోజుల క్రితం జనసేన పార్టీకి చెందిన సర్పంచ్ వర్గీయులు (సర్పంచ్ గతంలో వైసీపీ. ఎన్నికల తరువాత జనసేలో చేరారు) కూలీలను పురమాయించి అకేసియా చెట్లను నరికివేయడం మొదలుపెట్టారు. ఈ విషయం తెలుసుకున్న తెలుగుదేశం నాయకుడు వియ్యపు అప్పారావు అభ్యంతరం వ్యక్తం చేస్తూ, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. తహశీల్దారు లక్ష్మి ఆదేశాలతో పోలీసులు వచ్చి చెట్ల నరికివేతను అడ్డుకొన్నారు. బహిరంగ వేలం నిర్వహించిన తరువాతే చెట్లను నరికి, వచ్చిన డబ్బులను గ్రామాభివృద్ధికి వినియోగించాలని టీడీపీ నేత అప్పారావు పట్టుబట్టారు. ఈ నేపథ్యంలో అకేసియా చెట్ల నరికివేత గురించి చర్చించడానికి మంగళవారం గ్రామపెద్దలు, ఇరుపార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు రచ్చబండ వద్ద సమావేశమయ్యారు. అకేసియా చెట్లను నరికివేయించాలని జనసేన శ్రేణులు ప్రతిపాదించగా, వద్దని టీడీపీ శ్రేణులు స్పష్టం చేశారు. చెట్లను నరికి, వచ్చిన ఆదాయంతో గ్రామంలో అభివృద్ధి పనులు చేసుకోవచ్చని జనసేన నేతలు చెప్పగా.. చెట్లను నరికిన తరువాత ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతుందని, అందువల్ల చెట్లను నరకడానికి వీలులేదని టీడీపీ వర్గీయులు స్పష్టం చేశారు. దీంతో ఇరువర్గాల మధ్య మాటామాటా



పెరిగి తోపులాట, కొట్లాటకు దారితీసింది. రాళ్లు, కర్రలతో పరస్పరం దాడులు చేసుకున్నారు. దీంతో గ్రామంలో భయానక వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు ఎస్ఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గ్రామానికి వచ్చి, ఇరువర్గాల వారిని చెదరగొట్టారు. గాయపడిన వారికి పీహెచ్?సీలో ప్రథమ చికిత్స చేయించి అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. వీరు వియ్యపు దేవి, వియ్యపు చిరంజీవి, వియ్యపు రాము, ఆవాలు అప్పారావుగా గ్రామస్థులు చెబుతున్నారు. అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి, కొత్తకోట సీఐ కోటేశ్వరరావు బుచ్చెయ్యపేట పోలీసు స్టేషన్‌కు వచ్చారు. పెదమదీన గ్రామానికి చెందిన ఇరువర్గాల వారిని పోలీసు స్టేషన్‌కు రప్పించి కౌన్సెలింగ్ ఇచ్చారు. మరోసారి గొడవపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామంలో పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు.

## పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యలపై దృష్టి: పీవో శ్రీపూజ



**పాడేరు, పతాకం న్యూస్:** పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సంబంధిత సమస్యలపై దృష్టి సారించాలని రెవెన్యూ అధికారులను ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ పీవో తిరుమణి శ్రీపూజ ఆదేశించారు. జిల్లాలోని రెవెన్యూ అధికారులతో కలెక్టరేట్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. ఆయా సమస్యల పరిష్కారంపై మండల స్థాయి అధికారులు ప్రతి రోజూ సమీక్షించాలన్నారు. ఏ స్థాయిలోనూ పెండింగ్ లేకుండా చూసుకోవాలని, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి కార్యాలయాల నుంచి వచ్చే అర్జీలను తక్షణమే పరిష్కరించాలన్నారు. అర్జీల పరిష్కారంలో అధికారులు సకాలంలో స్పందించకపోవడంతో ఆ అంశంలో జిల్లా వెనుకబడిందనే అసహనం వ్యక్తమవుతుందన్నారు. జిల్లాలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని శత శాతం పూర్తి చేయాలని, పెండింగ్‌లో ఉన్న రేషన్ దుకాణాల రెన్యువల్ ఫైళ్లను క్లియర్ చేయాలని ఆదేశించారు. పీఎం జన్‌మన్ పథకంలో మంజూరైన ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా కృషి చేయాలని, అవసరమైన లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలను కేటాయించాలన్నారు. జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వ రాయితీలు, ఇతర సదుపాయాలు కల్పించాలన్నారు. పీజీఆర్ఎస్‌లో వినతుల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని సూచించారు. ఈ నెల 25న జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఆ రోజు ఆదివారం కావడంతో ముందుగానే పాఠశాలల యాజమాన్యాలతో చర్చించి, 25న ఓటరు దినోత్సవం సందర్భంగా ర్యాలీలు, ఇతర అవగాహన కార్యక్రమాలపై ఒక ప్రణాళిక రూపొందించుకుని అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పి.అంబేద్కర్, జిల్లాలోని పదకొండు మండలాలకు చెందిన రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# రొమ్ము క్యాన్సర్ ప్రమాదాన్ని ఎలా తగ్గించుకోవచ్చు?

రొమ్ము క్యాన్సర్, ఒకప్పుడు ఇది కాస్త వయసు పైబడిన వారిలోనే ఎక్కువగా వచ్చేది. కానీ, ఇప్పుడు యుక్త వయసులో ఉన్న మహిళలూ ఈ మహమ్మారి బారిన పడుతున్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అయితే, యుక్తవయస్సులో క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల రొమ్ము క్యాన్సర్ ప్రమాదాన్ని 20% వరకు తగ్గించుకోవచ్చని తాజా అధ్యయనాలు వెల్లడించాయి. మరి, అదెలాగో ఇప్పుడు తెలుసుకుందాం! ఆటల్లో చురుకుగా ఉండే యుక్తవయసు మహిళల రొమ్ములో నీరు అధికంగా చేరదని, వారి రొమ్ము సాంద్రత తక్కువగా ఉండటమే కాక ఒత్తిడి కారణంగా తలెత్తే జీవక్రియ సంబంధ రుగ్మతల సూచికలు తక్కువ స్థాయిలో ఉంటాయని తాజా అధ్యయనంలో వెల్లడైంది. బాలికల్లో రొమ్ము అభివృద్ధి చెందే యవ్వన దశలో శారీరక శ్రమతో కూడిన కార్యకలాపాల్లో పాల్గొంటే దీర్ఘకాలంలో రొమ్ము క్యాన్సర్? వచ్చే అవకాశాలను తగ్గించవచ్చని బ్రెస్ట్ క్యాన్సర్ రిసెర్చ్‌లో తేలింది. యువతుల్లో శారీరక శ్రమతో కూడిన ఆటపాటలు తగ్గిపోతుండటానికి క్యాన్సర్ అవకాశాలు పెరిగిపోతుండటానికి ఉన్న సంబంధాన్ని బ్రెస్ట్ క్యాన్సర్ రిసెర్చ్ అధ్యయన నివేదిక స్పష్టం చేసింది. అమెరికాలోనే కాక ప్రపంచం మొత్తంలో పరిస్థితి ఇదే విధంగా ఉందని తెలిపింది. ఆటపాటల్లోని శారీరక శ్రమ రొమ్ము కణజాల నిర్మాణాన్ని నిర్దేశిస్తుందని యూనివర్సిటీ ఆఫ్ కొలంబియాలోని స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్‌కు చెందిన రెబెకా కెహ్మ్ చెబుతున్నారు. శరీరంలో కొవ్వు ఏ మేరకు ఉందన్న విషయంతో ప్రమేయం లేకుండా నేటి యువతుల్లో మెబాలిజంతో (జీవక్రియ) సంబంధ క్యాన్సర్ కారకాల నియంత్రణకు ఆటపాటలు కారణమవుతాయని వివరిస్తున్నారు.



యుక్తవయసులో బాలికలు తీరిక సమయాల్లో ఆటల్లో పాల్గొనడం ద్వారా శారీరకంగా హుషారుగా ఉండటం, జిమ్, డాన్స్, యోగా వంటి కార్యకలాపాల్లో పాల్గొనడం రొమ్ము క్యాన్సర్ వచ్చే అవకాశాలను తగ్గిస్తుందని తాజా అధ్యయనంలో స్పష్టమైంది. ఈ అధ్యయనం కోసం దాదాపు 200 మంది యవ్వన దశలో ఉన్న అమ్మాయిలను ఎంచుకొన్నారు. అధ్యయనం నిర్వహించడానికి వారం ముందు ఎన్ని గంటల పాటు వారు ఆటల్లో పాల్గొన్నారన్న అనే సమాచారం సేకరించారు. వారి రక్త, మూత్ర నమూనాలు సేకరించడంతో పాటు రొమ్ము కణజాలాన్ని విశ్లేషించారు. సాధారణంగా, కణజాలంలో ఎక్కువ నీరు, కొల్లాజెన్ అంటే అధిక సాంద్రత, ఇది జీవితంలో తరువాతి కాలంలో క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉందని సూచిస్తుంది. ఈ క్రమంలో శారీరక శ్రమ అవసరమైన ఆటల్లో వారానికి రెండు గంటలకన్నా ఎక్కువ సమయం పాల్గొన్న బాలికల రొమ్ములో తక్కువ శాతం నీరు ఉన్నట్లు ఈ అధ్యయనంలో గుర్తించారు. క్రీడల వల్ల శరీరంలోని కేలరీలు ఎక్కువగా ఖర్చవుతాయని, ఇది అధిక బరువును తగ్గించుకోడానికి, ఒబెసిటీని అరికట్టడానికి సహాయపడుతుందంటున్నారు నిపుణులు.

అలాగే, ఆటలు ఒత్తిడిని, ఆందోళనను తగ్గిస్తాయుట. మెదడులో 'ఎండా ర్ఫిన్లు' విడుదల కావడంతో మనసు ఉల్లాసంగా ఉంటుందట. అంతేకాదు, ఆటల వల్ల ఏకాగ్రత పెరుగుతుంది. ఓటమిని తట్టుకోవడం, జట్టుగా పని చేయడం, క్రమశిక్షణ వంటి లక్షణాలు అలవడుతాయి. ఈ క్రమంలో ఆరోగ్యంగా ఉండటానికి ప్రతిరోజూ కనీసం 30 నిమిషాల పాటు ఏదో ఒక ఆట ఆడటం మంచిది.

# ముఖం కాంతివంతంగా ఉండాలంటే.. ఈ ప్యాక్స్‌ను ఉపయోగించండి



ముఖం తెల్లగా, అందంగా కనిపించాలని మగువులు కోరుకుంటూ ఉంటారు. కొన్ని న్యాచురల్ ప్యాక్స్ కాంతివంతమైన చర్మం పొందవచ్చు. ప్రకాశవంతమైన, కాంతివంతమైన, ఫెయిర్ స్కిన్ టోన్ కావాలని కోరుకోని అమ్మాయి ఉండదు. ముఖం అందంగా, తెల్లగా మెరిసిపోవాలని మగవులు కోరుకుంటూ ఉంటారు. అయితే, వీటి కోసం ఖరీదైన ఉత్పత్తులు వాడాలని, ఏవో ట్రీట్మెంట్‌లు తీసుకోవాలని అనుకుంటూ ఉంటారు. మీ స్కిన్‌టోన్‌ను మెరుగుపరచడానికి, తెల్లని ఛాయను అందించడానికి, కొన్ని హోం రెమిడీస్ సహాయపడతాయి. ఇంట్లో సులభంగా దొరికే వస్తువులతోనే.. సహజ కాంతిని పొందవచ్చు. అవేంటో ఈ స్టోరీలో చూద్దాం.?

నిమ్మరసం న్యాచురల్ బ్లీచింగ్ ఏజెంట్‌గా పనిచేస్తుంది. తేనె చర్మానికి తేమను, ఉపశమనం అందిస్తుంది. మీరు నిమ్మరసం, తేనెను సమభాగాలుగా తీసుకుని మిక్స్ చేయాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి, చేతులకు, మెడకు అప్లై చేసి.. 15 నిమిషాల పాటు ఆరనివ్వండి. ఆ తర్వాత చల్లటి నీళ్లతో ముఖం శుభ్రం చేసుకోండి. ఈ ప్యాక్ వేసుకున్నప్పుడు సూర్యరశ్మికి దూరంగా ఉండండి. నిమ్మరసంలో ఫోటోసెన్సిటివ్ లక్షణాలు ఉంటాయి. ఇలా వారానికి రెండు సార్లు చేస్తే.. మీ ఛాయ మెరుగుపడుతుంది. పసుపులో కర్కుమిన్ ఉంటుంది, ఇది చర్మాన్ని ప్రకాశవంతంగా మారుస్తుంది. పాలు చర్మాన్ని ఎక్స్‌ఫోలియేట్ చేస్తుంది, ఇది న్యాచురల్ క్లెన్సర్‌లా పనిచేస్తుంది. కాంతివంతమైన చర్మం పొందడానికి ఒక టీస్పూన్ పసుపులో తగినంత పాలు కలిపి పేస్ట్‌లా చేయండి. ఈ పేస్ట్‌ను ముఖానికి అప్లై చేసి 15 నుంచి 20 నిమిషాల పాటు ఆరనివ్వండి. ఆ తర్వాతా చల్లటి నీళ్లతో ముఖాన్ని శుభ్రం చేసుకోండి. ఇలా వారానికి రెండు సార్లు చేస్తే.. మంచి రిజల్ట్ ఉంటాయి. పాలలోని లాక్టిక్ యాసిడ్ ఎక్స్‌ఫోలియేషన్, చర్మాన్ని తాజాగా ఉంచుతుంది. పెరుగులో లాక్టిక్ యాసిడ్ ఉంటుంది, ఇది చర్మాన్ని సున్నితంగా ఎక్స్‌ఫోలియేట్ చేస్తుంది, కాంతివంతంగా మారుస్తుంది. ఓట్‌మీల్‌లో పెరుగును కలిపి పేస్ట్?లా తయారు చేయండి. ఈ మిశ్రమంతో చర్మంపై స్క్రబ్ చేయండి. ఆ తర్వాత 15 నిమిషాల పాటు ఆరనివ్వండి. ఇది చర్మంపై పేరుకున్న మృత కణాలను తొలగిస్తుంది. బొప్పాయిలో పపైన్ అనే ఎంజైమ్ ఉంటుంది. ఇది స్కిన్ ఎక్స్‌ఫోలియేషన్‌కు సహాయపడతాయి. బాగా పండిన బొప్పాయి ముక్కను గుజ్జు చేసి.. ముఖం, చేతులు, మెడ భాగాలలో అప్లై చేసుకోండి. దీన్ని 20 నిమిషాల పాటు ఆరనివ్వండి. ఆ తర్వాత నీళ్లతో శుభ్రం చేసుకోండి. ఈ మాస్క్ తరచు వేసుకుంటే.. స్కిన్ టెక్స్‌చర్‌ని మెరుగు పరుస్తుంది, డల్‌నెస్ తగ్గిస్తుంది. కీరా లోని శీతలీకరణ లక్షణాలు చర్మాని ఉపశమనం అందిస్తాయి. కలబంద గుజ్జు చర్మానికి తేమ నందిస్తుంది, మృదువుగా మారుస్తుంది. కీరాను గుజ్జు చేసి, దానిలో కలబంద గుజ్జు మిక్స్ చేయండి. దీన్ని ముఖానికి అప్లై చేసి, 20 నిమిషాల పాటు ఆరనివ్వండి. ఆ తర్వత చల్లటి నీళ్లతో శుభ్రం చేయండి. ఈ ప్యాక్ మీ ఛాయను మెరుగుపరుస్తుంది. బంగాళాదుంపలో ఎంజైమ్‌లు, విటమిన్ సి ఉంటాయి. ఇవి డార్క్ స్పాట్స్, పిగ్మెంటేషన్‌ను తగ్గిస్తాయి. బంగాళదుంపను పేస్ట్ చేసి, ముఖానికి ప్యాక్‌లా వేసుకోండి. దీన్ని 20 నిమిషాల పాటు ఆరని వ్వండి. ఆ తర్వాత నీళ్లతో శుభ్రం చేసుకోండి. ఇలా వారానికి రెండు సార్లు చేస్తే.. కాంతివంతమైన చర్మం పొందవచ్చు.

# గణతంత్ర వేడుకల వేళ ఢిల్లీలో ఆంక్షలు- పార్కింగ్ కోసం క్యూఆర్ కోడ్ టెక్నాలజీ



**న్యూఢిల్లీ పతాకం న్యూస్:** రిపబ్లిక్ డే వేడుకల వేళ దిల్లీ పోలీసులు వేళ దేశ రాజధానిలో ఆంక్షలు విధించారు. ముఖ్యంగా ట్రాఫిక్ నియంత్రణ కోసం పోలీసులు ప్రత్యేక ప్రణాళికను రూపొందించారు. ఇదే సమయంలో వేడుకలు సజావుగా సాగేందుకు భారీ ఎత్తున ఏర్పాటు చేస్తున్నారు. జనవరి 23న ఫుల్ డ్రెస్ రిహార్సల్ జరగనుంది. ఆ తర్వాత జనవరి 26న పరేడ్ ఉంటుంది. ఈ నేపథ్యంలో రాజధానిలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ఉండేందుకు బుధవారం అర్ధరాత్రి నుంచి ఆంక్షలను అమలు చేయనున్నారు. పరేడ్‌కు వచ్చే సామాన్య ప్రజలకు, ఆహ్వానితులకు ఎలాంటి ఇబ్బంది కలగకూడదని ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు పోలీసులు ఈసారి సరికొత్త టెక్నాలజీని కూడా వినియోగిస్తున్నారు. ముఖ్యంగా పార్కింగ్ కోసం 'క్యూఆర్ కోడ్' విధానాన్ని అందుబాటులోకి తెచ్చారు. ఈ మేరకు అదనపు పోలీస్ కమిషనర్ (ట్రాఫిక్) దినేష్ కుమార్ గుప్తా వివరాలు వెల్లడించారు. "పరేడ్ జరిగే 'కర్తవ్య పథ్' చుట్టూ భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకున్నాం. రాజధాని నలుమూలలా పోలీసులను మోహరిస్తాం. ప్రతి కూడలిలోనూ ట్రాఫిక్ పోలీసులు అందుబాటులో ఉంటారు. పరేడ్ సజావుగా సాగేలా చూడటమే వీరి ప్రధాన లక్ష్యం" అని తెలిపారు. దిల్లీ సరిహద్దుల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. బోర్డర్ పాయింట్ల వద్ద పోలీసు సిబ్బందిని మోహరించారు. జనవరి 23న రిహార్సల్ ఉన్నందున, జనవరి 22 రాత్రి నుంచే తనిఖీలు మొదలవుతాయి. అలాగే జనవరి 26 పరేడ్ కోసం జనవరి 25 రాత్రి నుంచే ఆంక్షలు అమల్లోకి వస్తాయి. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తారు. అనుమానాస్పద వాహనాలను లోపలికి అనుమతించరు. ట్రాఫిక్ మళ్లింపులు కూడా రాత్రి నుంచే మొదలవుతాయి. పరేడ్ జరిగే ప్రధాన మార్గాల్లో సాధారణ వాహనాలను పూర్తిగా నిషేధించారు. ఆ రూట్లలో కేవలం అనుమతి ఉన్న వాహనాలు మాత్రమే వెళ్లాలి. పాసులు లేని వాహనాలను అనుమతించరు. ప్రజలు దీనిని గమనించాలని పోలీసులు కోరారు. ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని సూచించారు. రిహార్సల్స్ సమయంలో స్థానిక పోలీసులు, ఇతర భద్రతా సంస్థలతో ట్రాఫిక్ పోలీసులు సమన్వయం చేసుకుంటున్నారు.

# తుంగభద్ర నుంచి నీటి విడుదల నిలుపుదల

## 3.5 లక్షల ఎకరాలపై ప్రభావం.. ఆందోళనలో ఆయకట్టు రైతులు



**కర్నూలు, పతాకం న్యూస్:** గేట్ల మరమ్మతు కోసం తుంగభద్ర ప్రాజెక్టు నుంచి నీటి విడుదలను నిలుపుదల చేశారు. దీంతో, రబీలో తుంగభద్ర ఆయకట్టుకు సాగునీరు ప్రశ్నార్థకంగా మారింది. దీంతో, రైతులు ఆందోళన చెందుతున్నారు. అధిక వర్షాలు కురిసినా ఉపయోగం లేకుండాపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గేట్ల మరమ్మతుల నేపథ్యంలో ఈ నెల పది వరకే ఆయకట్టుకు నీళ్లిస్తామని, తర్వాత రబీ పంటలకు నీళ్లివ్వలేమని తుంగభద్ర అధికారులు తొలుత ప్రకటించారు. స్థానిక ప్రజాప్రతినిధుల అభ్యర్థన మేరకు నీటి విడుదలను వారం రోజుల వరకూ పొడిగించారు. అనంతరం ఈ నెల 15 రాత్రి నుంచి తుంగభద్ర ఆయకట్టుకు నీటిని నిలిపేశారు. తుంగభద్ర ఆధారపడి రాయలసీమ జిల్లాలో ఎల్ఎల్‌సి, హెచ్ఎల్‌సి, ఆలూరు బ్రాంచ్ కెనాల్, కెసి కెనాల్ పరిధిలో 6.56 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. రబీ సీజన్లో ఇందులో 3.5 లక్షల ఎకరాల్లో పంటలు సాగు కావాలి. గతేడాది ఆగస్టులో తుంగభద్ర డ్యాం 19వ గేటు కొట్టుకుపోవడంతో తుంగభద్ర దిగువ కాలువ కింద రబీలో ఆయకట్టు సాగు కాలేదు. ఈ ఏడాది గేట్ల మరమ్మతుల వల్ల అర్ధాంతరంగా నీటి విడుదల నిలిపివేయడంతో ఇప్పటికే సాగులో చేస్తున్న తమ పరిస్థితి ఏమిటని ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు.

గతేడాది కొట్టుకుపోయిన గేటు స్థానంలో కొత్త గేటు ఏర్పాటుకు నిపుణుల కమిటీ సలహా మేరకు రూ.1.98 కోట్లతో టెండర్ పిలిచారు. టెండర్‌ను దక్కించుకున్న గుజరాత్ కంపెనీ ఏప్రిల్ చివరి వారంలో డిజైన్స్ తయారు చేసింది. టిబి బోర్డు ద్వారా ఎపి సెంట్రల్ డిజైన్ కమిటీకి పంపించినా దీని ఆమోదం నెల రోజులు ఆలస్యం కావడంతోనే సకాలంలో గేటు తయారు చేసి బిగించలేకపోయారు. దీంతో, డ్యాం సామర్థ్యాన్ని 105 టిఎంసిల నుంచి 80 టిఎంసిలకు తగ్గించారు. గేటు తయారు చేసి బిగించేందుకు రెండు నెలల గడువు ఇచ్చారు. గేటును సిద్ధం చేసుకొని డ్యాం దగ్గరకు తీసుకొచ్చారు. గత జూన్‌లో డ్యాం ఎగువన భారీ వర్షాలు కురవడంతో గేటు బిగించేందుకు సాధ్యం కాకపోవడంతో వాయిదా వేశారు. ఈ గేటుతో పాటు మిగిలిన 32 గేట్లను కూడా మార్చాలని నిర్ణయించారు. తయారీ టెండర్? దక్కించుకున్న గుజరాత్ కంపెనీ గేట్లను తయారు చేసింది. ఈ నెల 12న ఒక గేటును బిగించేందుకు నిర్వహించిన ట్రయల్ రన్ విజయవంతం కావడంతో మిగిలిన 32 గేట్ల మెటీరియల్‌ను డ్యాం వద్దకు చేరుస్తున్నారు. వారం రోజుల్లో గేట్ల బిగింపు పనులను ప్రారంభించనున్నారు. రబీలో ఎల్ఎల్‌సి, హెచ్ఎల్‌సి, కర్ణాటక సాగు నీటి కాలువకు రోజుకు 0.89 టిఎంసిల చొప్పున నెలకు సుమారు 27 టిఎంసిల ప్రకారం వచ్చే ఏడాది ఏప్రిల్ నెలాఖరు వరకు నీరు ఇవ్వాలంటే కనీసం 110 టిఎంసిల నీరు అవసరం. డ్యాంలో నీటి నిల్వ 28 టిఎంసిలకు చేరడంతో తుంగభద్ర ఆయకట్టుకు నీటిని నిలిపేశారు. దీంతో, 3.5 లక్షల ఎకరాల్లో ఆయకట్టు రైతుల రబీ ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. ఎపి ప్రభుత్వం చొరవ తీసుకుని రబీకి నీటిని విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.




# న్యూజిలాండ్-టీమిండియా ఐదు టీ20ల సిరీస్ ప్రారంభం



దాదాపు మరో మూడు వారాల్లో ప్రతిష్మాత్మక టీ20 వరల్డ్‌కప్‌నకు తెర లేవనుంది. ఈ మెగా టోర్నీకి ముందు భారత్ పొట్టి ఫార్మాట్‌లో తమ బలాబలాలను అంచనా వేసుకునేందుకు ఆఖరిసారిగా బరిలోకి దిగబోతోంది. నేటి నుంచి న్యూజిలాండ్‌తో ఐదు టీ20ల సిరీస్ జరగనుంది. అలాగే ఇటీవలే వన్డే సిరీస్‌ను ప్రత్యర్థికి కోల్పోయిన టీమిండియాకు ఈ సిరీస్ కీలకం కానుంది. జట్టులోని లోపాలను సరిదిద్దుకునేందుకు ఈ మ్యాచ్‌లను సద్విని యోగం చేసుకోవాలనుకుంటోంది. కెప్టెన్ సూర్యకుమార్ ఫామ్ అన్నింటికంటే ముఖ్యం కానుంది. 2024లో అతను సారథిగా బాధ్యతలు తీసుకున్నాక జట్టు 72 శాతం విజయాలతో మెరుగ్గానే ఆడుతోంది. పొట్టి ప్రపంచకప్? తర్వాత జట్టు ఆడిన ఎనిమిది ద్వైపాక్షిక సిరీస్‌లను కూడా గెలవడం విశేషం. అయితే సూర్య బ్యాట్ నుంచి మాత్రం పరుగులు రావడం లేదు. ఇలాంటి ఒత్తిడి మధ్య రాణించడంతో పాటు సిరీస్‌ను గెలిపించాల్సిన బాధ్యత కూడా అతడిపై ఉంది. అటు ప్రత్యర్థి న్యూజిలాండ్ ఇప్పటి వరకు భారత్‌లో టీ20 సిరీస్ గెలవలేదు. అందుకే 2024లో ఇక్కడ టెస్టు సిరీస్‌ను తాజాగా 37 ఏళ్ల తర్వాత వన్డే సిరీస్‌ను వశం చేసుకున్న మాదిరే పొట్టి ఫార్మాట్‌లోనూ సత్తా చూపాలనుకుంటోంది.

గాయం కారణంగా తిలక్ వర్మ తొలి మూడు మ్యాచ్‌లకు దూరమయ్యాడు. దీంతో మూడో నెంబర్?లో ఇషాన్ కిషన్‌కు స్థానం కల్పించనున్నారు. ఇక గతేడాది 19 మ్యాచ్‌లాడిన సూర్య కేవలం 218 పరుగులే చేశాడు. దీంతో బ్యాటింగ్ పరంగా ఈ సిరీస్ అతడికి చావోరేవో లాంటిదే. ఓపెనర్ అభిషేక్ భీకర ఫామ్‌తో బౌలర్లను వణికిస్తుండగా.. శాంసన్ నిలకడ చూపాల్సి ఉంది. పేసర్ బుమ్రాతో పాటు ఆల్‌రౌండర్ హార్దిక్ జట్టులోకి రావడం సానుకూలాంశం. అర్ష్‌దీప్, హర్షిత్ ఇతర పేసర్లు. స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి బౌలింగ్‌ను కివీస్ బ్యాటర్లు పెద్దగా ఆడలేదు కాబట్టి అతను కీలకం కానున్నాడు.

మిచెల్ శాంట్నర్ కెప్టెన్సీలో న్యూజిలాండ్ పూర్తి స్థాయి జట్టుతో పొట్టి ఫార్మాట్‌లో బరిలోకి దిగనుంది. అందుకే వన్డే సిరీస్ మాదిరే ఇందులోనూ ఆధిపత్యం చూపేందుకు ఎదురుచూస్తోంది. అటు వన్డే సిరీస్ ఏడు వికెట్లతో ఆకట్టుకున్న పేస్ ఆల్‌రౌండర్ క్రిస్టియాన్ క్లార్క్‌ను తొలి మూడు టీ20ల కోసం ఎంపిక చేశారు. అలాగే రచిన్, హెన్రీ, డఫీ జట్టులోకి వచ్చారు. బ్యాటింగ్‌లో డారిల్ మిచెల్, ఫిలిప్స్ భీకర ఫామ్‌లో ఉండగా కాన్వే, రచిన్, రాబిన్సన్ కూడా కీలకం కానున్నారు.

భారత్: అభిషేక్, శాంసన్, ఇషాన్, సూర్యకుమార్ (కెప్టెన్), హార్దిక్, అక్షర్, రింకూ సింగ్, దూబే, బుమ్రా, హర్షిత్/అర్ష్‌దీప్, వరుణ్.

న్యూజిలాండ్: రాబిన్సన్, కాన్వే, రచిన్, మిచెల్, ఫిలిప్స్, చాప్‌మన్, నీషమ్, శాంట్నర్ (కెప్టెన్), హెన్రీ, సోధీ, డఫీ.

# సూర్య ఫామ్‌లోకి రాకపోతే జట్టుకు కష్టాలు తప్పవు: రోహిత్ శర్మ



న్యూజిలాండ్-భారత జట్లు ఐదు టీ20ల సిరీస్‌లో తలపడనున్నాయి. నేడు నాగ్‌పూర్ వేదికగా తొలి మ్యాచ్ ప్రారంభం కానుంది. ఇప్పటికే మూడు వన్డేల సిరీస్‌ను కోల్పోయిన భారత్.. టీ20 సిరీస్‌నూ పట్టేయాలని చూస్తోంది. అయితే.. ప్రస్తుతం అందరి ఆందోళన కెప్టెన్ సూర్య కుమార్ యాదవ్ ఫామ్ గురించే! గత 20 ఇన్నింగ్స్ నుంచి సూర్య బ్యాట్ నుంచి ఒక్క హాఫ్ సెంచరీ కూడా రాకపోవడం గమనార్హం. కెప్టెన్సీ పరంగా అజేయంగా నిలిచిన స్కై.. వ్యక్తిగతంగా ఫామ్‌లేమితో ఇబ్బంది పడుతున్నాడు. ఈ నేపథ్యంలో టీమిండియా స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ.. సూర్యకు ఓ కీలక సూచన చేశాడు.

'కెప్టెన్ ఫామ్‌లో ఉన్నాడా? లేడా? అన్నది ఇక్కడ సమస్య కాదు. ఒక ప్లేయర్ ఫామ్‌లో లేకుంటే.. మనకు ఎనిమిది మంది బ్యాటర్లు అందుబాటులో ఉంటారు. అయితే.. మనకున్న ప్రధాన బ్యాటింగ్ పవర్ తడబాటుకు గురైతే పరిస్థితి కఠినంగా మారుతుంది. ప్రణాళికలు, వ్యూహాలు పక్కాగా అమలు చేయడం వీలుకాదు. అనుకున్నంతగా ప్రభావం చూపడం కష్టం. ఒకవేళ సూర్య సరిగ్గా బ్యాటింగ్ చేయలేకపోతే.. బ్యాటింగ్ లైనప్ కచ్చితంగా ఇబ్బంది పడుతుంది. కెప్టెన్‌గా సూర్యలో మైనస్ అంటూ ఏమీలేదు. అతడికి ఆటపట్ల ఓ అవగాహన ఉంది. తన జట్టులోని ఆటగాళ్లలో అత్యుత్తమ ప్లేయర్ల ఎవరనేది అతడికి బాగా తెలుసు. వారి నుంచి ఉత్తమ ప్రదర్శన ఎలా రాబట్టాలో కూడా అతడికి తెలుసు' అని రోహిత్ వెల్లడించాడు. టీ20 ప్రపంచ కప్ 2026కి సన్నాహకంగా భావిస్తోన్న ఈ సిరీస్‌లో సూర్య ఫామ్ అందుకుంటాడా? లేదా? అనేది చూడాల్సి ఉంది. సూర్య ఫామ్‌లోకి వచ్చి పరుగులు చేస్తే.. జట్టుకు విజయం లాంఛనమే అన్న ఉద్దేశంలో అభిమానులు ఉన్నారు.




# చిరంజీవి సినిమాలో కృతి శెట్టి?



సినిమాల్లో ఒక హిట్ కొట్టడం కంటే ఆ హిట్‌ను కొనసాగిస్తూ అవకాశాలు దక్కించుకోవడమే అసలైన సవాల్. ఈ విషయాన్ని చాలా మంది హీరోహీరోయిన్ల కెరీర్ స్పష్టంగా చెబుతుంది. ఇప్పుడు అదే పరిస్థితిని ఎదుర్కొంటున్న హీరోయిన్ కృతిశెట్టి గురించి టాలీవుడ్‌లో మళ్లీ చర్చ మొదలైంది.

'ఉప్పెన' సినిమాతో ఒక్కసారిగా స్టార్‌డమ్ తెచ్చుకున్న కృతి... ఆ తర్వాత వరుసగా సినిమాలు చేసినా ఆశించిన స్థాయి విజయాలు మాత్రం దక్కలేదు. మంచి నటిగా గుర్తింపు ఉన్నప్పటికీ, కమర్షియల్‌గా పెద్ద హిట్ లేకపోవడంతో ఆమె కెరీర్ కొంత స్లో అయిందనే చెప్పాలి. అయితే ఇప్పుడు ఆమె కు మరోసారి భారీ అవకాశం దక్కినట్టు ఇండస్ట్రీ వ ం ా ్ల ం చెబుతున్నాయి.

ఇటీవలే 'మన శంకర వం ్ప్రసాద్? గారు' సినిమాతో బ్లాక్?బస్టర్? అందుకున్న మెగాస్టార్ చిరంజీవి... తన తదుపరి సినిమాకు సిద్ధమవుతున్నారు. దర్శకుడు బాబీతో చిరు మరోసారి కలిసి పనిచేయనున్నారు. ఈ సినిమా ఈ నెలలో లాంచ్? అయ్యే అవకాశముండగా, మార్చి నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలవుతుందని సమాచారం.

ఈ ప్రాజెక్ట్‌లో కృతిశెట్టికి కీలక పాత్ర ఇచ్చినట్టు టాక్ వినిపిస్తోంది. అయితే చిరంజీవి సరసన హీరోయిన్‌గా కాదు, ఆయన కుమార్తె పాత్రలో కృతి కనిపించనుందనే సమాచారం వినిపిస్తోంది. కథ మొత్తం ఫాదర్-డాటర్ సెంటిమెంట్ చుట్టూ తిరుగు తుందని, బెంగాల్ బ్యాక్ డ్రాప్‌లో ఈ మూవీ సాగు తుందని చెబు తున్నారు.

ఇక ఈ సినిమాలో మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్ ఓ ముఖ్యమైన పాత్రలో నటించనున్నారన్న ప్రచారం కూడా ఉంది. చిరంజీవికి జోడీగా ప్రియమణిని ఎంపిక చేసినట్టు, సంగీత దర్శకుడిగా ఏఆర్ రెహమాన్‌ను తీసుకునే ఆలోచనలో మేకర్స్ ఉన్నట్టు తెలుస్తోంది. అయితే, ఈ అంశాలపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఒకవేళ ఈ వార్త నిజమైతే... కృతిశెట్టికి ఇది కెరీర్‌ను మళ్లీ ట్రాక్‌లో పెట్టే మెగా ఛాన్స్ అవుతుందని చెప్పొచ్చు.

# ప్రేక్షకులకు చిరంజీవి ఎమోషనల్ లేఖ



సంక్రాంతి కానుకగా వచ్చిన 'మన శంకరవరప్రసాద్ గారు' మూవీ ఘన విజయం సాధించిన నేపథ్యంలో మెగాస్టార్? చిరంజీవి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు తెలుగు ప్రేక్షకులు, అభిమానులకు కృతజ్ఞతలు చెబుతూ ఓ ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. రికార్డులు వస్తుంటాయి, పోతుం టాయని, కానీ ప్రేక్షకులు తనపై కురిపించే ప్రేమ మాత్రం శాశ్వతమన్నారు. దశాబ్దాలుగా తన వెంట నిలబడిన వారందరికీ ధన్యవాదాలు చెప్పారు.

"మన శంకరవరప్రసాద్ గారు చిత్రానికి ప్రేక్షక దేవుళ్లు చూపిస్తున్న ఆదరణ, అపూర్వమైన విజయాన్ని చూస్తుంటే నా మనసు కృతజ్ఞత భావనతో నిండిపోతోంది. నేను ఎప్పుడూ చెప్పేది నమ్మేది ఒక్కటే. నా జీవితం మీ ప్రేమాభిమానాలతో ముడిపడింది. మీరు లేనిదే నేను లేను. ఈ రోజు మళ్లీ అదే నిజమని మీరు నిరూపించారు. ఈ విజయం పూర్తిగా నా ప్రియమైన తెలుగు ప్రేక్షకులది, నా ప్రాణసమానమైన అభిమానులది, నా డిస్ట్రిబ్యూటర్లది, సినిమాకు ప్రాణం పెట్టి పనిచేసిన ప్రతీ ఒక్కరిది. ముఖ్యంగా దశాబ్దాలుగా నా వెంట నిలబడి ఉన్నవారందరిది. వెండితెర మీద నన్ను చూడగానే మీరు వేసే విజిల్స్, చప్పట్లే నన్ను నడిపించే శక్తి. రికార్డులు వస్తుంటాయి, పోతుంటాయి. కానీ, మీరు నాపై కురిపించే ప్రేమ మాత్రం శాశ్వతం. ఈ బ్లాక్‌బస్టర్ విజయం వెనుక ఎంతో కృషి చేసిన మా దర్శకుడు హిట్ మెషీన్ అనిల్ రావిపూడికి, నిర్మాతలు సాహు, సుస్మితలకు, అలాగే మొత్తం టీమ్ అందరికీ, నాపై మీరందరూ చూపిన అచంచలమైన నమ్మకానికి ధన్యవాదాలు. ఈ సంబరాన్ని అలాగే కొనసాగిద్దాం. మీ అందరికీ ప్రేమతో లవ్ యూ ఆల్. మీ చిరంజీవి"




# నన్ను కాపాడటానికి ఎవరూ లేరు రేణు దేశాయ్



వీధి కుక్కలను చంపడంపై గళమెత్తిన నటి రేణూ దేశాయ్? మరోసారి భావోద్వేగంగా స్పందించారు. తనను కాపాడటానికి ఎవరూ లేరంటూ సోషల్ మీడియాలో చేసిన పోస్ట్ ప్రస్తుతం వైరల్‌గా మారింది. ఈ అంశంపై తాను చేసిన వ్యాఖ్యలకు తీవ్ర విమర్శలు ఎదురవుతున్నాయని, అయినా వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని రేణు స్పష్టం చేశారు.

కాశీలో గంగానదిలో బోటింగ్ చేస్తున్న వీడియోను షేర్ చేసిన ఆమె, "నన్ను కాపాడటానికి అమ్మానాన్న, అన్నయ్య, భర్త ఎవరూ లేరు. అయినా నా తప్పు లేకపోయినా ఎంతోమంది నన్ను విమర్శిస్తున్నారు. వాటికి తిరిగి సమాధానం చెప్పే ఉద్దేశం నాకు లేదు. నేను నమ్మే భగవంతుడికే నా బాధ చెప్పుకుంటాను. ఆయన నా ప్రార్థనలు వింటాడన్న విశ్వాసం ఉంది. నేను తరచూ కాశీకి ఎందుకు వస్తానో ఇప్పుడు అర్థమవుతుందేమో" అంటూ భావోద్వేగంగా రాసుకొచ్చారు. అలాగే వీధి కుక్కల విషయంలో తన పోరాటం కొనసాగుతుందని రేణూ మరోసారి స్పష్టం చేశారు. "నేను ఎప్పుడూ నా వ్యక్తిగత హక్కుల కోసం పోరాడలేదు. కానీ, కొన్ని కుక్కల తప్పు కారణంగా వందల సంఖ్యలో వాటిని చంపడం సరైన నిర్ణయం కాదు. ఈ విషయాన్ని సమాజం అర్థం చేసుకునే వరకూ నా పోరాటం ఆగదు" అని తేల్చిచెప్పారు.

తాను ఒక రాజకీయ పార్టీలో చేరనున్నట్లు వచ్చిన వార్తలను కూడా ఆమె ఖండించారు. తనకు అలాంటి ఉద్దేశం ఏమాత్రం లేదని స్పష్టతనిస్తూ, ఇది పూర్తిగా జంతు హక్కుల కోసం చేస్తున్న పోరాటమేనని రేణూ దేశాయ్ పేర్కొన్నారు.

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**